షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 319 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 5 అక్టోబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 319 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 5 October 2024 PAGES : 8 PRICE : 5/-

## స్వతంత్ర సిట్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

- తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై విచారణ..
- సిట్ విచారణపై ఎలాంటి సందేహాలు లేవన్న సొలిసిటర్ జనరల్
- స్వతంత్ర దర్యాప్తు జరిగితే మంచిదేనన్న అత్యున్నత న్యాయస్థానం
- సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఐదుగురు సభ్యులతో స్వతంత్ర సిట్ ఏర్పాటుకు ఆదేశం




## విశాఖ స్టీల్ ఆంధ్రా రాష్ట్రానికి తలమానికం



- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోలేకపోతే చంద్రబాబు రాజీనామా చేయాలి
- ప్లాంట్‌కు హాని జరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోం
- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎంతటి పోరాటానికైనా కాంగ్రెస్ పార్టీ సిద్ధం
- అధికారంలోకి వచ్చాక పవన్ కల్యాణ్ మారిపోయాడు
- తిరుపతి వారాహి సభలో రాహుల్ పై పవన్ వ్యాఖ్యలు
- పవన్ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఖండిస్తోందన్న షర్మిల
- పవన్ ఓ మతానికి చెందిన వేషం వేసుకున్నారంటూ విమర్శలు
- ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**అమరావతి**

ఎన్డీయే కూటమిలో ప్రధాన భాగస్వామ్యమైన టీడీపీ విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. శుక్రవారం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో చంద్రబాబు విశాఖ స్టీల్ పరిరక్షణ కోసం కేంద్రానికి లేఖ రాశారని, ఆ లేఖలో స్వయంగా ఆయన సంతకం కూడా చేశారని - మిగతా3లో



## బీహార్‌లో మళ్లీ చెడుతున్న బీజేపీ-జేడీయూ బంధం

- నితీశ్ ప్రధాని అవుతారన్న మంత్రి జమాఖాన్...
- నితీశ్ కుమార్ ప్రధాని అయితే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్న మంత్రి జమాఖాన్
- ప్రధాని కుర్చీ ఖాళీ లేదన్న బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అజయ్ అలోక్
- బీహార్‌లో నితీశ్‌ను గద్దెదింపేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్న ఆర్జేడీ

# శ్రీవారి సేవలో సీఎం

- తిరుమల వెంకన్నకు పట్టువస్త్రాలు సమర్పించిన నారా చంద్రబాబు నాయుడు
- శ్రీవారికి ఎక్కువసార్లు పట్టువస్త్రాలు సమర్పించే అదృష్టం నాకు లభించింది
- తిరుమలలో వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు
- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు
- ఇక్కడ గోవింద నామస్మరణ తప్ప మరేమీ ఉండకూడదని స్పష్టీకరణ



**తిరుమల**

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో తొలిరోజైన శుక్రవారం రాత్రి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవేంకటేశ్వరస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ముఖ్యమంత్రి బేడి ఆంజనేయస్వామివారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడినుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకట చౌదరి స్వాగతం పలికారు. ఆ తరువాత గౌ॥ ముఖ్యమంత్రి ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. వకుళామాత, విమాన - మిగతా3లో



## సుప్రీం కోర్టు వ్యాఖ్యలను వక్రీకరిస్తున్న జగన్

- కోర్టు ఆర్డర్ రాకముందే జగన్ ప్రెస్‌మీట్ పెట్టి అబద్ధాలు చెప్పారు
- కోర్టు చంద్రబాబు కు మొట్టికాయలు వేసిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- రాజకీయ కారణాలకు కోర్టు వేదిక కాదనే ధర్మాసనం చెప్పింది
- స్వతంత్ర దర్యాప్తుతో నిజాలు వెలుగులోకి వస్తాయనే మాట కూడా జగన్ చెప్పలేదు
- మంత్రి పయ్యావుల కేశవులు

**అమరావతి**

తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను వైసీపీ అధినేత వక్రీకరిస్తున్నారని ఏపీ మంత్రి పయ్యావుల కేశవులు ఆరోపించారు. కోర్టు ఆర్డర్ రాకముందే జగన్ ప్రెస్‌మీట్ పెట్టి అబద్ధాలు చెప్పారని విమర్శించారు. కోర్టు చంద్రబాబు కు మొట్టికాయలు వేసిందని తప్పుడు ప్రచారం - మిగతా3లో

# చంద్రబాబును స్వామివారు క్షమించరు

- రాజకీయాలకు స్వామి పేరును వాడుకోవడం దురదృష్టకరం
- చంద్రబాబు నిజస్వరూపాన్ని సుప్రీం ఎత్తి చూపింది
- అయినా ఆయన తీరు మారలేదు
- భక్తుల మనోభావాలతో చంద్రబాబు ఆడుకుంటున్నారు
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్
- నువ్వా... సనాతన ధర్మం గురించి మాట్లాడేది?
- చంద్రబాబు చేసిన తప్పును పవన్ సమర్థిస్తున్నాడన్న జగన్
- అలాంటప్పుడు సనాతన ధర్మం గురించి మాట్లాడితే అర్థమేముంది
- బాబు నిజస్వరూపాన్ని సుప్రీంకోర్టు ఎత్తిచూపింది: జగన్
- టీడీపీ రాజకీయ దుర్బుద్ధిని సుప్రీంకోర్టు అర్థం చేసుకుందన్న జగన్



**తాడేపల్లి**

రాజకీయ దుర్బుద్ధితో ఎలా రెచ్చగొడుతున్నారో సుప్రీంకోర్టు అర్థం చేసుకుంది కాబట్టే... దేవుడ్ని రాజకీయాల్లోకి లాగొద్దు, రాజకీయ డ్రామాలు చేయొద్దు అని స్పష్టమైన వ్యాఖ్యలు చేసిందని వివరించారు. చంద్రబాబు స్వయంగా వేసుకున్న సిట్ ను సైతం రద్దు చేసిందని తెలిపారు. లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని ఆరోపించడం ద్వారా చంద్రబాబు తిరుమల పవిత్రతను, స్వామివారి విశిష్టతను మంటగలిపాడని, కోర్టులు సైతం చంద్రబాబుకు మొట్టికాయలు వేశాయని విమర్శించారు. కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ చంద్రబాబు - మిగతా3లో



## షాంఘై సదస్సుకు పాక్ వెళ్తున్న జైశంకర్

- అక్టోబర్ 15, 16న పాకిస్థాన్‌లో కేంద్రమంత్రి జైశంకర్ పర్యటన
- ఇస్లామాబాద్ వేదికగా వార్షిక షాంఘై సహకార సంఘం సమావేశం
- ఎస్సీవో సదస్సుకు ఆతిథ్యమిస్తున్న పాక్
- ఈ సమావేశానికి హాజరుకానున్న జైశంకర్



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- 14 మంది మావోయిస్టులు మృతి
- దంతెవాడ-నారాయణపూర్ సరిహద్దుల్లో కాల్పుల మోత
- నెత్తురోడిన అబూజ్ మాఢ్ అటవీప్రాంతం

# శ్రీవారి సేవలో సీఎం

-మొదటిపేజీ తరువాయి

వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదమంత్రోచ్ఛారణతో వేద పండితులు ఆశీర్వదించారు. టీటీడీ ఈఓ ముఖ్యమంత్రి గారికి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇక్కడ గోవింద నామస్మరణ తప్ప మరేమీ ఉండకూడదని స్పష్టీకరణ

తిరుమల శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్రంలో, దేశంలో, విదేశాల్లో ఉండే హిందువులందరికీ అభినందనలు తెలిపారు. ఈ రోజు బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయని వెల్లడించారు. ఈ బ్రహ్మోత్సవాలు 9 రోజులు జరుగుతాయని, స్వామివారు వివిధ రకాల వాహనాల్లో తిరుమాడ వీధుల్లో ఊరేగింపుగా తిరుగుతారని చంద్రబాబు వివరించారు. వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఇక్కడికి వచ్చే భక్తులే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు ఒక పవిత్రభావంతో వీక్షిస్తారని పేర్కొన్నారు.

కలియుగ దేవుడు, ఈ సమాజాన్ని అన్ని విధాలా ఆదుకునే దైవం వెంకటేశ్వరస్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరపున అత్యధిక పర్యాయాలు పట్టు వస్త్రాలు, ఇతర లాంఛనాలు సమర్పించే అదృష్టం తనకు లభించిందని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. బ్రహ్మోత్సవాలు జరిగే 9 రోజుల్లో 15 లక్షల



మంది భక్తులు తిరుమల వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా టీటీడీ అన్ని రకాల చర్యలు చేపడుతోందని అభినందించారు. ఇక్కడ గోవింద నామస్మరణ తప్ప మరేమీ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అని చంద్రబాబు పేర్కొన్నారు.

# చంద్రబాబును స్వామివారు క్షమించరు

-మొదటిపేజీ తరువాయి

పద్ధతి ప్రకారం అబద్ధాలు ఆడాడని, చంద్రబాబు స్వయంగా నియమించుకున్న టీటీడీ ఈవోనే చంద్రబాబు మాటలకు విరుద్ధంగా లడ్డూలపై ప్రకటన చేశాడని జగన్ వెల్లడించారు.

రాజకీయాలకు వెంకటేశ్వరస్వామిని వాడుకోవడం దురదృష్టకరం. ఈ విషయంలో సీఎం చంద్రబాబును వెంకటేశ్వరస్వామి క్షమించరని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ దుర్బుద్ధితో మత విశ్వాసాలను ఎలా రెచ్చగొట్టారో సుప్రీంకోర్టు అర్థం చేసుకుంది. లడ్డూలో కల్తీ జరిగిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి మత విశ్వాసాలను ఎలా కావాలనే రాజకీయ దుర్బిద్ధితో రెచ్చగొట్టారో సుప్రీం కోర్టు అర్థం చేసుకుంది కాబట్టే వార్నింగ్ ఇస్తూ దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దు. పొలిటికల్ కామెంట్స్ చేయవద్దని వార్నింగ్ ఇచ్చింది. చంద్రబాబు వేసుకున్న సిట్‌ను సైతం రద్దు చేసింది. నిజంగా తిరుమల పవిత్రను, స్వామివారి ప్రసాదం విశిష్టతను నిజంగా రాజకీయ దుర్బుద్ధితో కావాలనే అబద్ధాలు లాడారు. జంతువుల కొవ్వును లడ్డూను తయారు చేశారని అసత్య ప్రచారం చేశారు. వాటన్నింటికి సంబంధించి గత కొద్ది రోజులుగా సాక్ష్యాధారాలతో సహా నేను చూపించడమే కాకుండా కోర్టు సైతం చంద్రబాబును ప్రశ్నించింది. కోట్లాది మంది భక్తుల విశ్వాసం, నమ్మకాన్ని చంద్రబాబు అబద్ధాలతో దెబ్బతీశారు. క్లియర్‌కట్‌గా తెలిసే విధంగాసాక్ష్యాత్తు టీటీడీ ఈవో శ్యామలరావు.. చంద్రబాబు మాటలకు విరుద్ధంగా ప్రకటన చేశారు . ఇవన్నీ గమనిస్తే చంద్రబాబు ఇప్పటికే మంచి వ్యక్తి అయితే ఇంత ఆధారాలు కనిపిస్తే సిగ్గుపడాలి. భయపడాలి. ప్రశ్చాత్తాపం రావాలి. ప్రజలకు క్షమాపణ చెప్పే కార్యక్రమం జరగాలి. సెప్టెంబర్ 18న చంద్రబాబు తన వంద రోజుల పాలన సభలో ..తన పాలన అన్ని విధాల ఫెయిల్ అయిన సందర్భంలో ప్రజలు చంద్రబాబును నిలదీస్తున్న పరిస్థితుల్లో టాఫిక్ డైవర్ట్ చేసేందుకు ..కల్తీ నెయ్యితో లడ్డూ తయారు చేశారని ఆరోపించారు. దేవుడి వద్ద పెట్టే ప్రసాదం అపవిత్రం



చేశారని, జంతువుల కొవ్వు వాడారని చంద్రబాబు అసత్యాలు చెప్పారు. ఈవో మాత్రం విజిటబుల్ ఫ్యాట్ ..రిజెక్ట్ చేశామని చెబుతుంటే..చంద్రబాబుకు అన్ని తెలిసి కూడా రెండు నెలల తరువాత జంతువుల కొవ్వును వాడారని ఏకంగా దేవుడి ప్రతిష్టను , శ్రీవారి లడ్డూ విశిష్టతను అపవిత్రం చేశారు. సెప్టెంబర్ 20వ తేదీ టీటీడీ ఈవో మళ్లీ ఇదే విషయంపై చంద్రబాబును కనెక్ట్ చేస్తూ..అసలు ఆ నెయ్యిని వాడలేదు. ఆ ట్యాంకర్లను వెనక్కి పంపించామని ఈవో మరోసారి చెప్పారు. అయినా కూడా మళ్లీ సెప్టెంబర్ 22న చంద్రబాబు అబద్ధాలు చెప్పారు. అప్పటికే నాలుగు ట్యాంకర్లు వచ్చాయి. వాటిని వాడారని అబద్ధాలకు రెక్కలు కట్టి గోబెల్స్ ప్రచారం చేస్తూ మన లడ్డూ విశిష్టతను మనమే తగ్గించడం, కోట్ల మంది భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు. దేవుడంటే భయం, భక్తి లేకుండా చంద్రబాబు అడుగులు వేశారు. ఈ రోజు ఇదే విషయంపై చంద్రబాబు తెలిసి తెలిసి రాజకీయ దురుద్దేశాలతో అబద్ధాలు ఆడి టీటీడీ లడ్డూ విశిష్టతను దెబ్బతీస్తే కోర్టు కూడా మొట్టికాయలు వేయాలని ప్రధానికి కూడా లేఖ రాశాం. సుప్రీం కోర్టు సైతం ఈ కేసులో విచారణ చేపట్టిన జడ్జిలు చంద్రబాబు తీరును తప్పుపట్టారు. అసలు నెయ్యి వాడలేదని టీటీడీ ఈవో స్వయంగా చెప్పారు కదా? అలాంటిది లడ్డూలో జంతు కొవ్వు ఉందని సీఎం ఎలా చెబుతారని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఆధారాలు లేకపోయినా రాజ్యాంగ పదవిలో ఉన్న సీఎం అలా ఎలా మాట్లాడుతారు. ఈ వ్యాఖ్యలు సిట్ విచారణలో ప్రభావితం చూపించవా? ల్యాబ్ రిపోర్టును ఎందుకు పరిగణలోకి తీసుకోలేదు. సెకెండ్ ఆప్షన్ ఎందుకు వెళ్లలేదు. ఎన్‌డీడీబీ నివేదిక జులైలో వస్తే అప్పుడేందుకు మాట్లాడలేదు. జంతువుల కొవ్వు కలిపారని సీఎం చేసిన ప్రకటనలో ఆయన వద్ద ఉన్న ఆధారాలు ఏంటి? అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో బహిరంగ ప్రకటన ఎలా చేస్తారు? కోట్ల మంది భక్తుల మనోభావాలు దెబ్బతీస్తాయన్నది తెలియదా అని సుప్రీం కోర్టు అక్షింతలు వేసింది. 30వ తదీ వచ్చిన జడ్జిమెంట్ కాపీలోనే ఈ విషయాలు పేర్కొంది. సుప్రీం కోర్టు జడ్జిమెంట్ కాపీలను మీడియాకు వైయస్ జగన్ వివరించారు. సుప్రీం కోర్టు డైరెక్షన్‌లో ఐదుగురితో స్వతంత్ర దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేసింది. వీళ్లు లడ్డూకు సంబంధించిన విషయంపై నివేదిక ఇస్తారని సుప్రీం కోర్టు ఇవాళ చెప్పింది. చంద్రబాబుకు ఏమాత్రం దేవుడిపై భయం, భక్తి లేకుండా తప్పు చేసినట్లు కనిపిస్తున్నా కూడా ప్రశ్చాత్తాప పడకుండా, ప్రజలకు క్షమాపణ చెప్పకుండా ట్విట్టర్‌లో అసత్యాలు, అబద్ధాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు.

**అసలు ఈ మనిషికి సనాతన ధర్మం అంటే ఏమిటో తెలుసా?**

తిరుపతి వారాహి సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సనాతన ధర్మం గురించి మాట్లాడడంపై వైసీపీ అధినేత జగన్ స్పందించారు. అసలు ఈ మనిషికి సనాతన ధర్మం అంటే ఏమిటో తెలుసా? అని ఎత్తిపొడిచారు.

“నువ్వు ఆ కూటమిలో ఉన్నావు... నీ కళ్ల ఎదుటే చంద్రబాబు ఈ తప్పు చేశాడు... అది తప్పు అన్న విషయం నీకే కాదు ఆరేళ్ల పిల్లాడికి కూడా అనిపిస్తుంది. తిరుమల పవిత్రతను తగ్గిస్తూ, వెంకటేశ్వరస్వామి లడ్డూ విశిష్టతను తగ్గిస్తూ, కోట్లాది మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వారి మనసుల్లో అనుమానాన్ని సృష్టించడం నీ కళ్ల ఎదుటే జరుగుతోంది కదా! అందులో నువ్వు కూడా భాగమయ్యావు, ఆ అబద్ధాలకు రెక్కలు కట్టావు... నువ్వే దుష్ప్రచారం చేస్తూ ముందుకు వెళుతున్నావు... అలాంటి నువ్వు సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నావు. ఏదైనా తప్పు జరిగినప్పుడు దాన్ని మనం ఎత్తిచూపకుండా, గుడ్డిగా దాన్ని సమర్థిస్తూ సనాతన ధర్మం గురించి మాట్లాడడం ఎంతవరకు సబబు అని అడుగుతున్నా!” అంటూ జగన్ వ్యాఖ్యానించారు.

# వంగవీటి పొలిటికల్ లైఫ్ టర్న్ కాబోతోందా

**విజయవాడ :** :వంగవీటి మోహన్ రంగ రాజకీయ వారసుడిగా తెరపైకి వచ్చారు రాధాకృష్ణ. కానీ సరైన రాజకీయ నిర్ణయాలు తీసుకోవడంలో ఆయన ఫెయిల్ అయ్యారు. అందుకే సుదీర్ఘకాలం పవర్ పాలిటిక్స్ కు దూరమయ్యారు. అయితే గత అనుభవాలను గుణపాఠాలుగా మార్చుకొని రాజకీయాలు చేశారు. ఈ ఎన్నికల్లో టిడిపి కూటమి గెలుపునకు కృషి చేశారు. ఎన్ని రకాల ఒత్తిళ్లు ఎదురైనా టిడిపిలోనే కొనసాగారు. ఇప్పుడు అదే రాధాకృష్ణ గుర్తింపునకు కారణమైంది. ఆయనకు త్వరలో పదవి వచ్చే అవకాశం కనిపిస్తోంది. చంద్రబాబు రాధాకృష్ణకు తగు రీతిలో గౌరవిస్తారని.. ఎమ్మెల్సీగా ఛాన్స్ ఇస్తారని ప్రచారం నడిచింది. ఇప్పుడు ఆ అవసరం వచ్చింది.కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ పేరును టిడిపి హై కమాండ్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. తొలుత టిడిపి అభ్యర్థిగా మాజీమంత్రి ఆలపాటి రాజాను ఎంపిక చేసినట్లు ప్రచారం సాగింది. అయితే వైసిపి ఈ సీటు విషయంలో ప్రతిష్టాత్మకంగా ఉండడంతో.. వంగవీటి రాధా పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయంతో వైసిపి ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దాని నుంచి బయట పడాలంటే సరైన విజయం దక్కాలని భావిస్తోంది. అందుకే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. వైసీపీ అభ్యర్థిగా గౌతమ్ రెడ్డి పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.ఆయన వైయస్ కుటుంబానికి సమీప బంధువు. ఆపై బలమైన ఆర్థిక నేపథ్యం ఉంది. ఆయనను ఢీకొట్టాలంటే వంగవీటి రాధాకృష్ణ అయితే సరైన అభ్యర్థి అవుతారని టాక్ నడుస్తోంది.వంగవీటి రాధాకృష్ణ వైసీపీని వీడడానికి గౌతమ్ రెడ్డి ఒక కారణం.



విజయవాడ రాజకీయాల్లో గౌతంరెడ్డి దూకుడుగా ఉంటారు. కార్మిక సంఘాల్లో మంచి పట్టు ఉంది. వైసీపీ ఆవిర్భావం నుంచి రాధాకృష్ణ జగన్ వెంట నడిచారు. అయితే గౌతమ్ రెడ్డి విజయవాడ రాజకీయాల్లో ఎంటర్ అయ్యేసరికి సీన్ మారింది. గౌతం రెడ్డికి రాధాకృష్ణతో విభేదాలు ఎదురయ్యాయి. అవే వంగవీటి మోహన్ రంగ పై గౌతమ్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు కారణమయ్యాయి. అయితే అప్పట్లో కనీసం గౌతమ్ రెడ్డిని మందలించలేదు జగన్. అది రాధాకృష్ణకు నచ్చలేదు. పైగా నచ్చిన సీటు నుంచి తప్పించడంతో రాధాకృష్ణ టిడిపి వైపు వచ్చారు. ఒక విధంగా చెప్పాలంటే గౌతంరెడ్డి వల్లనే రాధాకృష్ణ పార్టీ మారారు. ఇప్పుడు అదే గౌతమ్ రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మారడంతో.. వంగవీటి రాధాకృష్ణను చంద్రబాబు ప్రయోగిస్తారని ప్రచారం నడుస్తోంది. 2004లో తొలిసారిగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి అసెంబ్లీలో అడుగు పెట్టారు రాధాకృష్ణ. తండ్రి మోహన్ రంగ మరణం సమయానికి ఆయన బాలుడు. అయితే 2003లో వైయస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేశారు. ఆ సమయంలో రాధాకృష్ణను చూసి రాజకీయాల్లోకి ఆహ్వానించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థిగా టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచారు రాధాకృష్ణ. అయితే 2009 ఎన్నికల నాటికి ప్రజారాజ్యం పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. జగన్ పిలుపుమేరకు వైసీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో మరోసారి పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో ఆయనకు టికెట్ దక్కలేదు. దీంతో టీడీపీలోకి వచ్చారు. ఇప్పుడు పట్టభద్రుల ఎమ్మెల్సీ రూపంలో రాధాకృష్ణకు ఛాన్స్ దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. సో రాధాకృష్ణ పొలిటికల్ లైఫ్ టర్న్ అయ్యే ఉందన్నమాట.

## స్వతంత్ర సిట్‌కు సుప్రీంకోర్టు ఆదేశం




తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టు విచారణలో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయంలో సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర సిట్ తో విచారణ జరిపించాలని కోర్టు ఆదేశించింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం ఈ రోజు ఉదయం విచారణ చేపట్టగా ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. సిట్ దర్యాప్తు కొనసాగాలా లేక కేంద్ర దర్యాప్తు సంస్థలకు విచారణ అప్పగించాలా అన్న విషయంపై సుప్రీంకోర్టు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయం కోరిన విషయం తెలిసిందే. దీంతో సొలిసిటర్ జనరల్ సిట్ విచారణపై తమకు ఎలాంటి సందేహాలు లేవు అని అన్నారు. అయితే, సిట్‌పై పర్యవేక్షణ ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఇక స్వతంత్ర దర్యాప్తు జరిగితే మంచిదేనని జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో దర్యాప్తు సంస్థలో ఐదుగురు సభ్యులు ఉండాలని తెలిపింది. ఇందులో సీబీఐ నుంచి ఇద్దరు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇద్దరితో పాటు ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒక నిపుణుడు ఉండాలని న్యాయమూర్తులు పేర్కొన్నారు. బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి, వైఎస్ఆర్సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, రచయిత సంపత్ విక్రమ్, ఓ టీవీ ఛానల్ ఎడిటర్ సురేష్ ఖండేరావు చౌహాన్కే దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు విచారణ జరిపింది.

## సుప్రీం కోర్టు వ్యాఖ్యలను వక్రీకరిస్తున్న జగన్

-మొదటిపేజీ తరువాయి

చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ కారణాలకు కోర్టు వేదిక కాదనే ధర్మాసనం చెప్పిందని గుర్తు చేశారు. స్వతంత్ర దర్యాప్తుతో నిజాలు వెలుగులోకి వస్తాయనే మాట కూడా జగన్ చెప్పలేదని అన్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందానికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా , నిష్పక్షపాతంగా సహకరిస్తామని వెల్లడించారు. తిరుమలలో నిజాలు బయటకు రావాలనే నిజాయితీగా కోరుకుంటున్నామని అన్నారు. దోషులు ఎవరనేది విచారణలో తేలుతుందని వెల్లడించారు. చంద్రబాబు వేంకటేశ్వరస్వామి విషయంలో నిజాలు తప్ప అబద్ధాలు చెప్పరనే నమ్మకంతో ప్రజలు లడ్డూకల్తీ అంశాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్నారని అన్నారు. లడ్డూ అంశం పార్టీ అంతర్గత విషయంలో మాట్లాడారని, మీడియా సమావేశంలో కాదని చెప్పారు.

## విశాఖ స్టీల్ ఆంధ్రా రాష్ట్రానికి తలమానికం

-మొదటిపేజీ తరువాయి

గుర్తు చేశారు. ప్లాంట్ ను రక్షించుకునేందుకు రాజీనామాలకు సైతం సిద్ధమని పేర్కొన్నారని వెల్లడించారు. ప్రస్తుతం మీరే అధికారంలో ఉన్నారు.

ఇచ్చిన మాట మీద స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటారా..? లేక రాజీనామా చేస్తారా..? చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ఆంధ్రా రాష్ట్రానికి తలమానికమని, ప్లాంట్ కు హాని జరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోమని హెచ్చరించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎంతటి పోరాటానికైనా కాంగ్రెస్ పార్టీ సిద్ధమని ప్రకటించారు.

**పవన్ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఖండిస్తోంది**

తిరుపతి వారాహి సభలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యల పట్ల ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు.

మీకు అధికారం శాశ్వతం అనుకోవద్దు... తిరుపతి సభలో రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని మీరు చేసిన వ్యాఖ్యలు నిరాధారమైనవి, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించదగ్గవి కావు అని స్పష్టం చేశారు. మీ మత రాజకీయాల్లోకి రాహుల్ గాంధీని లాగడాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోంది అని షర్మిల పేర్కొన్నారు. రాహుల్ గాంధీకి పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. “అధికారంలోకి వచ్చాక డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారి వేషం, భాష రెండూ మారాయి. లౌకికవాద పార్టీగా ఉన్న జనసేన రైటిస్ట్ పార్టీగా మారిందా? బాధ్యత కలిగిన పదవిలో ఉంటూ... ఒక మతానికి చెందిన వేషం వేసుకుని, ఆ మతమే ముఖ్యమని మాట్లాడుతుంటే, ఇతర మతాలకు అభద్రతా భావం ఉండదా? ఎన్నికల్లో మీకు ఇతర మతాల వారు ఓట్లు వేయలేదా? ఇతర మతాల వారికి మనోభావాలు ఉండవా? మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమైతే, అదే సిద్ధాంతానికి పవన్ కల్యాణ్ డబుల్ ఏజెంట్ గా మారాడు. ప్రధాని మోదీ డైరెక్షన్ లో యాక్టింగ్ చేసే మీకు రాహుల్ గాంధీ గురించి మాట్లాడే నైతికత లేదు. గోద్రా, మణిపూర్ లో ఊచకోత కోసింది బీజేపీ పార్టీ కాదా? అలాంటి పార్టీకి మద్దతిస్తున్న మీరు లౌకికవాదం పాటించాలని చెబితే నమ్మమంటారా? దేశంలో ప్రేమ, సమానత్వం, సోదరభావం పెంపొందించేందుకు రాహుల్ గాంధీ వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అలాంటి వ్యక్తిపై వ్యాఖ్యలు చేయడం తగదు... మీ స్థాయిని దిగజార్చుకోవద్దు” అని షర్మిల స్పష్టం చేశారు.

## లాయర్ ఖర్చు..ఎవరిది...

**తిరుమల :** తిరుమల లడ్డు వ్యవహారం యూటర్న్ తీసుకుంది. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇవ్వడం హాట్ టాపిక్ గా మారింది. కోట్లాదిమంది భక్తుల మనోభావాల విషయంలో.. రాష్ట్ర సీఎం గా ఉన్న చంద్రబాబు బాధ్యత రాహిత్యంగా ప్రకటనలు చేస్తే ఎలా అని అర్థం వచ్చేలా తప్పు పట్టింది.ఆధారాలు లేకుండా,సెకండ్ ఒపీనియన్ తీసుకోకుండా ఎలా బయటకు వెల్లడిస్తారని ప్రశ్నించింది. టీటీడీ లడ్డు తయారీకి సంబంధించి..నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందని చంద్రబాబు ఎన్డీఏ శాసనసభ పక్ష సమావేశంలో ప్రస్తావించారు. అక్కడి నుంచి రచ్చ ప్రారంభమైంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. అయితే సిట్ విచారణ నిలిపివేయాలని, సీబీఐ దర్యాప్తు ఏర్పాటు చేయాలని వైసీపీ నేత వైవి సుబ్బారెడ్డి, బిజెపి మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభం అయింది. అయితే టీటీడీ తరుపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్ర వాదించారు.బలమైన వాదనలు వినిపించారు. ఇఅయితే ఈ కేసులో సిద్ధార్థ లూథ్ర ఎంటర్ కావడం చర్చకు దారితీస్తోంది. గతంలో చంద్రబాబుపై అక్రమ కేసుల్లో వాదనలు వినిపించారు ఆయన. చంద్రబాబుపై అవినీతి కేసులు నమోదైన సంగతి తెలిసిందే. దాదాపు 52 రోజులు పాటు ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.ఆ సమయంలో ఆయన ఏసీబీ కోర్టు నుంచి మళ్లీ సుప్రీంకోర్టు వరకు చంద్రబాబు తరఫున వాదనలు వినిపించారు. చివరకు చంద్రబాబుకు బెయిల్ వచ్చేలా చేశారు. అయితే అప్పట్లో సిద్ధార్థ లూథ్ర పెద్ద చర్చకు దారి తీశారు.లూథ్ర సుప్రీంకోర్టులో సీనియర్ మోస్ట్ లాయర్. ఎన్నో కేసుల్లో విజయం సాధించారు. సక్సెస్ ఫుల్ లాయర్ కావడంతో నిత్యం బిజీగా ఉంటారు. ఒక్కో కేసు విచారణకు లక్షల్లో తీసుకుంటారని ప్రచారం ఉంది. గంటలకు లక్షలు తీసుకుంటారని కూడా టాక్ నడిచింది. దేశంలో ఏ కోర్టులనైనా వాదించేందుకు సిద్ధమని..ప్రత్యేక విమానాల్లో వచ్చి వాదించిన సందర్భాలు కూడా ఉన్నాయని ఎన్నో రకాల విశ్లేషణలు ఉన్నాయి. అటువంటి సిద్ధార్థ లూథ్ర ఇప్పుడు టిటిడి లడ్డు కేసులో వాదనలు వినిపించడం విశేషం.అప్పట్లో చంద్రబాబు టిడిపి అధినేత. ఓ రాజకీయ పార్టీ నాయకుడు. కచ్చితంగా టిడిపి లాయర్ ఖర్చులు అప్పట్లో భరించి ఉంటుంది. కానీ ఇప్పుడు టీటీడీ లడ్డు వివాదం కేసులో లూథ్ర వాదనలు వినిపిస్తున్నారు. అయితే ఆయనకు ఫీజు టీటీడీ చెల్లిస్తుందా?లేకుంటే ప్రభుత్వం చెల్లిస్తుందా? అన్నది హాట్ టాపిక్ అవుతోంది. లక్షలాది రూపాయలు ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అందుకే ఎవరు చెల్లిస్తారో?అన్నది మాత్రం బయటకు తెలియడం లేదు. టీటీడీ చెల్లిస్తే మాత్రం ప్రత్యర్థులకు ప్రచారాస్త్రంగా మారే అవకాశం ఉంది.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



## ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలికిన దేవాదయశాఖ మంత్రి ఆనం

(షణ్ముఖ వెలుగు, తిరుపతి, అక్టోబర్ 4)

దసరా బ్రహ్మోత్సవాల నేపథ్యంలో స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దంపతులు శుక్రవారం రాత్రి తిరుమల శ్రీ పద్మావతి అతిథి గృహం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.

# పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన చేసుకోవాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పటిష్టంగా అమలు చేయాలి

ఎంపిడిఓ లు, ఈఓపిఆర్‌డి అధికారులు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)

పంచాయతీ రాజ్ చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన చేసుకొని, క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయడంలో ఎంపిడిఓ లు, ఈఓ పిఆర్ అండ్ ఆర్డి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలు పోలీసు శిక్షణా కేంద్రంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో డిఎల్ పి.ఓ.లు, ఎం.పి.డి.ఓ లు, ఈఓ పిఆర్ అండ్ ఆర్డి అధికారులకు మూడు రోజుల పాటు ఇస్తున్న శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు నుండి మూడు రోజుల పాటు ఇస్తున్న శిక్షణా కార్యక్రమంలో ఉద్యోగ రీత్యా అనుభవం వున్న వారు కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు వున్నారని, ఈ శిక్షణా కార్యక్రమంలో వివరించే అంశాల గురించి తెలిసిన విషయాలైతే అప్ డేట్ చేసుకోవడం, తెలియని విషయాలను తెలుసుకోవడం చేయాలన్నారు. నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియని, శిక్షణ ప్రతి ఉద్యోగికి అవసరమని, వారి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణలో తెలిపే అంశాలను సీరియస్‌గా, క్షుణ్ణంగా అర్ధం చేసుకొని, తెలుసుకొని క్షేత్ర స్థాయిలో నిజాయితీగా, పారదర్శకంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత మీ అందరిపై వుందన్నారు. మండల స్థాయిలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం, పర్యవేక్షించడం పూర్తిగా ఎం.పి.డి.ఓ లపై వుందన్నారు. అలాగే అనేక కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వం పరంగా వివిధ లక్ష్యాలను ప్రాధాన్యతా క్రమంలో నిర్దేశించడం జరుగుతుందని, ఆ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన భాధ్యత మీ అందరిపై వుందన్నారు. ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో పర్యటించి ముఖ్యంగా పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో క్షేత్ర స్థాయిలో వున్న సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పై అధికారులకు (తరువాయి 4లో...)

# జీవితాంతం మాజీ సీఎం జగన్‌కు, వైసీపీకి వీర విధేయుడుగా ఉంటా

వైసీపీ జిల్లా నూతన అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

నూతన జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)

తన జీవితాంతం వైయస్ జగన్ మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కే వీర విధేయుడుగా ఉంటానని,పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడే నిజమైన కార్యకర్తగా నిలబడతానని దర్శి ఎమ్మెల్యే నూతన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు ఒంగోలు చర్చి సెంటర్లోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి హౌసింగ్ బోర్డ్ పార్టీ నూతన కార్యాలయంలో డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి నూతన అధ్యక్షత బాధ్యతల స్వీకారం అట్టహాసంగా జరిగింది.నూతన అధ్యక్ష ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులువేలాదిగా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తన జీవితాంతం రుణపడి ఉంటానని, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్రెడ్డి వారి తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డిలు తన కుటుంబానికి అన్నివేళలా అండగా నిలిచారనిఅన్నారు.తను ఖాళీగా ఉన్నాను ఏదో ఒక పదవి ఇవ్వన్నా అని జగన్ని అడిగితే దర్శి ఎమ్మెల్యేగా నిలబెట్టాడని తన తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డిని నన్ను ఎమ్మెల్యేలుగా నిలబెట్టి తమకు రాజకీయ భవిష్యత్తును చూపించిన వైయస్ఆర్ కు జగన్మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. చాలామంది జిల్లా అధ్యక్ష బాధ్యత తీసుకుంటున్నవు,అది ముళ్ళ కిరీటం అని భయపెట్టినా,వెన్నుపోటు పొడుస్తారని హెచ్చరించినా కానీ తాను ఎన్నికల్లో నిలబడినప్పుడుతనను వెన్నుపోటు పొడిచేందుకు దాదాపు 30 మంది దాకా తనను ఓడించటానికి రేయం పగళ్లు పని చేశారన్నారు. కార్యకర్తలే తనను గెలిపించారని కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదని అని 4

# ప్రకాశం జిల్లా సమ్మిళిత అభివృద్ధిపై దృష్టి



జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)

ప్రకాశం జిల్లా సమ్మిళిత అభివృద్ధిపై దృష్టి పెట్టినట్లు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా చెప్పారు. ఇందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రజలను ఆమె కోరారు. "స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంట్" రూపకల్పనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన నేపధ్యంలో ప్రకాశం జిల్లాకు సంబంధించిన విజన్ డాక్యుమెంట్ పైనా అధికార యంత్రాంగం దృష్టి సారించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో శుక్రవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన సూచనలు, సలహాలను ఆమె స్వీకరించారు. విద్య, వైద్యం, కమ్యునికేషన్, పర్యాటకం, నీటిపారుదల, పరిశ్రమలు, మార్కెట్ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా జిల్లాను సమగ్రంగా అభివృద్ధి పరచవచ్చని ప్రతినిధులు చెప్పారు. నీటి పారుదల వ్యవస్థను సమర్ధంగా నిర్వహించడం ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ దిశగా అవసరమైన పనులు చేపట్టడంతోపాటు సిబ్బందిని కూడా నియమించాలని కోరారు. తూర్పువైపున ఉన్న సముద్రతీరం, గుండ్లకమ్మ, రామతీర్థం ప్రాజెక్టతోపాటు పశ్చిమ ప్రాంతంలో ఎకోటూరిజం (తరువాయి 4లో...)

# ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది

- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- మాతృభూమికి సేవ చేసే అవకాశం దక్కింది
- రాజమండ్రి ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, అక్టోబర్ 4)

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఓఎన్‌జీసీ, రామ్‌కి గ్రూప్ సంస్థల సహకారంతో కారంచేడు మండల కేంద్రంలో నిర్మించిన జేపీచెరువు వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ 1ఎం ఎల్ డి మైక్రో ప్లాంట్ ను మంత్రి రవికుమార్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు కలిసి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అదే గ్రామంలో నిర్మించనున్న మరొక ప్లాంటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వర్లు, ఎంపీ పురందేశ్వరిల తనయుడు హితేష్ చెంచురాం ఒక కోటి రూపాయల విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు. సూక్ష్మ శుద్ధ జల కేంద్రంలో యంత్రాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో అతిథులు మాట్లాడారు. ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి రవికుమార్ అన్నారు. కారంచేడు మండలమే గాకుండా నియోజకవర్గం అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబుల్ ఫండ్ నుంచి నిధులను కేటాయించి గ్రామ ప్రజల దాహార్తి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారని తెలిపారు. సామాజిక బాధ్యతతో దగ్గుబాటి హితేష్ చెంచురాం రూ.ఒక కోటి విరాళం అందించడం అభినందనీయం అన్నారు. మాతృభూమికి సేవ చేసే అవకాశం దక్కిందని రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. గ్రామీణ అభివృద్ధి 4



# ప్రజల ప్రాణాలతో చెలగాటం

మరోసారి బయటపడ్డ మెడికల్ షాపు యజమాని బాగోతం

పలుమార్లు సీజ్...అయినా మారని తీరు

ఇలాంటివి ఇంకా ఎన్ని ఉన్నాయో

నిద్రమత్తు వీడని అధికార యంత్రాంగం





(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 4)

మెడికల్ షాపులో మందులు కొంటున్నారా జాగ్రత్త.. ఒక వేళ కొంటే మాత్రం తప్పకుండా వాలిడిటీ తేది చూసుకోండి. లేదంటే అంతే సంగతులు. కాలం చెల్లి నెలలు గడుస్తున్నా యదేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఇదేంటి అని ప్రశ్నిస్తే నా ఇష్టం ఇలానే అమ్ముతా ఏమి చేసుకుంటారో చేసుకోండి అంటున్నాడు ఆ మెడికల్ షాపు యాజమాని. ఇది కంభం పట్టణంలోని ఓ మెడికల్ షాపు యజమాని (తరువాయి 4లో...)

## పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన చేసుకోవాలి



తెలియచేయడంతో పాటు వాటిని పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. చెంచుల అభివృద్ధి కోసం పిఎం జన్ మన్ కార్యక్రమం కింద అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుచున్నవని, వాటిని సక్రమంగా, త్వరితగతిన జరిగేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజలకు సేవలందించడంలో ఎవరు అలసత్వం వహించరాదని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో వుంచుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం వుందని కలెక్టర్ అన్నారు. జిల్లా పరిషత్ సి.ఈ.ఓ చిరంజీవి మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ , మండల పరిషత్, జిల్లాపరిషత్ వ్యవస్థలను ఏ విధంగా బలోపేతం చేయవచ్చు. పంచాయతీ రాజ్ వ్యవస్థల పనితీరు, శానిటేషన్, తాగునీరు కల్పన తదితర అంశాలపై ఈ రోజు నుండి మూడు రోజుల పాటు డి.ఎల్.పి ఓ. లు, ఎం.పి.డి.ఓలు, ఈఓ పిఆర్ అండ్ ఆర్డి అధికారులకు శిక్షణ ఇవ్వడం జరుగుచున్నదన్నారు. అలాగే స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి, జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డి.ఎల్.పి ఓలు, ఎం.పి.డి.ఓ లు, ఈఓ పిఆర్ అండ్ఆర్డీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జీవితాంతం మాజీ సీఎం జగన్‌కు, వైసీపీకి వీర విధేయుడుగా ఉంటా













పేర్కొన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ కొంతమంది అధికారంలో ఉన్నప్పుడు వస్తుంటారు పోతుంటారని అధికారం లేనప్పుడు మాత్రమే పని చేసే వాళ్లే నిజమైన కార్యకర్తలని అన్నారు.

కార్యకర్తలకు అన్యాయం జరిగిందని జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు బాధపడుతున్నారని కచ్చితంగా మున్ముందు జగన్ మోహన్ రెడ్డి కార్యకర్తలకు అండగా నిలబడే రోజు వస్తుందని పేర్కొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను టిడిపి కూటమి శ్రేణులు భయభ్రాంతులకు గురి చేస్తూ దాడులకు పాల్పడుతూ బెదిరించాలని చూస్తే కొంతకాలం మాత్రమే అది సాగుతుందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తిరగబడితే చెట్టుకొకరు పుట్టుకొకరు వెళ్లిపోతారని హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే అన్న రాంబాబు, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, కరణం వెంకటేష్, ఒంగోలు నగర పార్టీ అధ్యక్షులు కటారి శంకర్, జూపూడి ప్రభాకర్‌రావు, కనకారావు మాదిగ, కనిగిరి అసెంబ్లీ ఇన్‌ఛార్జి డాక్టర్ దాద్దాల నారాయణ, వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ), కుప్పంప్రసాద్, మారెడ్డి సుబ్బారెడ్డి, బడుగు ఇందిర, బొట్ల రామారావు, బొట్ల సుబ్బారావు, దుంప చెంచిరెడ్డి, కొత్తపట్నం ఎంపీపీ అంజిరెడ్డి, ఇనగంటి పిచ్చిరెడ్డి, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, జడ్పిటిసి మెంబర్లు, కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తలు, భారీ ఎత్తున పాల్గొన్నారు.


## ప్రకాశం జిల్లా సమ్మిళిత అభివృద్ధిపై దృష్టి



అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. హార్టీకల్చర్ పంటలను నిల్వ చేసుకునేందుకు అవసరమైన గిడ్డంగులను, అనుబంధ పరిశ్రమలను నెలకొల్పాలని వారు కోరారు. ప్రకాశం జిల్లా పాడి పరిశ్రమకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని, దీనిని కొనసాగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వివిధ సంఘాల నాయకులు సూచించారు. పశ్చిమ ప్రాంతంలో మిర్చి యార్డు నిర్మిస్తే ఆయా రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని రైతు సంఘాల నాయకులు చెప్పారు. పశ్చిమ ప్రాంతంలో కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. ప్రతి మండలానికి ఒక జూనియర్ కాలేజీని కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఓ. వెంకటేశ్వర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలతో చెలగాటం

నిర్లక్ష్యపు సమాధానం. వివరాల్లోకి వెళితే ప్రకాశం జిల్లా కంభం పట్టణంలోని స్థానిక బస్టాండ్ దగ్గర ఉన్న



బాలాజీ మెడికల్ స్టోర్‌లో యజమాని వద్ద గురువారం కంభంకు చెందిన షేక్ నయీమ్ అనే వ్యక్తి తన 10 నెలల పాపకి ఆరోగ్యం బాగాలేక ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చూపించగా డాక్టర్ సిరప్ మందులు రాసి ఇస్తే వాటిని బాలాజీ మెడికల్ స్టోర్‌లో కొనుగోలు చేసి వాటిని ఇంటికి తీసుకెళ్లాడు. మందులు తన పాపకు వేసే ముందు పరిశీలించగా మూడు నెలల క్రితం కాలం చెల్లినట్లు గమనించి వెంటనే మెడికల్ షాపు దగ్గరికి వెళ్లి ఇదేమిటని ప్రశ్నించాడు. దీనికి సమాధానంగా ఏమి చేసుకుంటావో చేసుకో అంటూ దురుసుగా మాట్లాడుతున్నాడని ఒకవేళ చూసుకోకుండా మందులు వేసి ఉంటే నా పాప పరిస్థితి ఏమిటి అని ప్రశ్నిస్తే నాకేం సంబంధం అని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడని నేను ఔషధ నియంత్రణ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసానని తెలిపాడు. అయితే గతంలో కూడా ఈ షాపుని పలుమార్లు అధికారులు సీజ్ చేయగా, మత్తు పదార్థాలు విక్రస్తున్నాడని కూడా ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా ఇలాంటి మెడికల్ షాపులపైన సంభంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది



కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకరించడం సంతోషదాయకమన్నారు. గ్రామంలో రహదారులు, కాల్వలు నిర్మించడం శుభపరిణామన్నారు. కాలుష్యమైన నీటిని ప్రజలు తాగుతున్నట్లు గుర్తించి శుద్ధ జల కేంద్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నా మన్నారు. అధిక నిధులు వెచ్చించి నిర్మిం చిన కేంద్రాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనిట్ పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. శుద్ధ జల కేంద్రం భవిష్యత్తులో మరమ్మతులకు గురైతే దాతలను ఆశ్రయించకుండా గ్రామస్తులే వినియోగంలోకి తెచ్చుకోవాలన్నారు. జలవనరులను సంరక్షించుకోవాలని సూచించారు. జన్మస్థలం, కన్నతల్లిని మరువకుండా మన వంతు సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఊరి ప్రజల సంక్షేమాన్ని కోరుతూ శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. ఉన్నత స్థాయిలోకి ఎదిగినప్పటికీ బాధ్యతగా సేవలందించడం గొప్ప విషయం అన్నారు. జల వనరులు పరిశుభ్రతను కోల్పోతున్నాయన్నారు. వాటిని సంరక్షించుకుంటేనే భావితరాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర నిధులతో గ్రామంలో పనులు చేపట్టాడానికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. 12 వేల జనాభా ఉన్న గ్రామంలో ప్రతిరోజు 10 లక్షల లీటర్ల శుద్ధ జలం పంపిణీ చేయడానికి ప్లాంట్ సమర్థంగా పనిచేస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. సిసి రోడ్లు, సైడ్ కాల్వలు నిర్మిస్తామని, ఆర్ డబ్ల్యు ఎస్ ద్వారా సురక్షిత నీటిని సరఫరా చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కారంచేడు గ్రామానికి మరొక చెరువు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. కొమ్మమూరు కాల్వపై లస్కర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. గ్రామంలో విద్యుత్ లైన్లు, స్తంభాలు కొత్తవి ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. కారంచేడు గ్రామానికి అవసరమైన శుద్ధ జల కేంద్ర ప్రారంభించుకోవడం సంతోషదాయకమని మాజీమంత్రి దగ్గుపాటి వెంకటేశ్వరరావు అన్నారు. జన్మభూమి రుణం తీర్చుకునే అవకాశం కలిగినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు శుద్ధ జలం అందించడం కొరకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రముఖులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మాచర్ల - చెన్నై బస్ సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 4)

మాచర్ల నుండి చెన్నైకు బస్సు సర్వీసును మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అర్చకులు ఎమ్మెల్యే జూలకంటి చేత ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిపో మేనేజర్ పిచ్చయ్యతో కలిసి బస్సును నడిపి సర్వీసును ప్రారంభించారు. ఈ సర్వీస్ వల్ల మాచర్ల పరిసర ప్రాంతాలలో వ్యాపారాలు కొనసాగించే వారికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. సాఫ్ట్వేర్ కంపెనీలో పని చేసే ఉద్యోగులు ఈ సర్వీస్ ను ఉపయోగించుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో మాచర్ల డిపో నుండి మరిన్ని సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలూరి నరసింహారావు మాచర్ల మార్కెట్ యాడ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, కొమ్మెర దుర్గారావు, షేక్ మదర్ సాహెబ్, సంబోజి, వేణు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివిధ విభాగాల్లో ఇంటర్వ్యూలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)

జిల్లా ఉపాధి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృధి సంస్థ, సీడప్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో జయలక్ష్మి, మారుతి, సెలెక్ట్ గాడ్జెట్స్, ఇన్నోవా సోర్స్ సర్వీసెస్ పివిటి ఎల్టిడి (సిబిఐ కార్డ్స్) కంపెనీలో "సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు, మూల్యాంకనం చేసేవారు, మెకానిక్స్, టెలికాలర్లు , సహాయకులు స్టోర్ మేనేజర్లు, క్యాషియర్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ , బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, టెలి కాలర్, ఎంఐఎస్ ఎగ్జిక్యూటివ్, టీఎస్, బీడీయూ యూనిట్ మేనేజర్", సెక్టార్‌లలో వివిధ రకాల ఖాళీలను భర్తీచేయుటకు ఏదైనా విభాగంలో ఐ.టి.ఐ, డిప్లమో, టెన్త్, ఇంటర్మీడియేట్ , ఏదైనా డిగ్రీ చదువులు పూర్తి చేసిన వారికి ఇంటర్వ్యూలు ప్రభుత్వ ఐటీ(బాలికలు) కళాశాల, ఒంగోలు నందు ఈ నెల 8వ తేదీన (మంగళవారం ) ఉదయం 10:00 గం.ల నుండి సాయంత్రం 3గం.ల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇంటర్వ్యూ లో ఎంపిక కాబడిన అభ్యర్థులకు జీతం నెలకు రూ.10,000 నుండి రూ.30,000 వరకు ప్లస్ పనితీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకం ఇవ్వటం జరుగుతుందని, టి.భరద్వాజ్, జిల్లా ఉపాది కార్యాలయం అధికారిగారు తెలిపారు. కావున జిల్లాలోని 18సం,, నుండి 30 సం,,మధ్య గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఇంటర్వ్యూ కు ఆధార్ కార్డు, సరిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని టి. భరద్వాజ్, జిల్లా ఉపాది కార్యాలయం అధికారి తెలిపారు. మరిన్ని వివరములకు షార్ట్‌యూఆర్‌ఎల్.ఏటీ/జేపీకేహెచ్‌ఎక్స్ లేదా ఆఫీసు పని సమయాలు 9160797311లను సంప్రదించగలరు.

# ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ వల్లే ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ బిల్లుల చెల్లింపులో జాప్యం

### దసరా తర్వాతే ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ బిల్లులకు చెల్లింపులు

### దళిత నేత నీలం నాగేంద్రకు తెలిపిన సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కన్నబాబు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ వల్లే ఎస్సీ, ఎస్టీ కేసుల్లో రిలీఫ్ బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగిందని, పది రోజుల్లో 14 కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తామని సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి కన్నబాబు దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావుకు తెలిపారు. శుక్రవారం నీలం నాగేంద్రరావు, మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగలు సెక్రటేరియట్‌లో కన్నబాబును కలిశారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ బిల్లుల్లో కేంద్ర ప్రభుత్వం తన వాటా 50% నిధుల్ని రాష్ట్రానికి పంపిందని, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా 50% నిధులను 9 నెలలుగా చెల్లించ లేదన్నారు. ఫలితంగా హత్య, అత్యాచారం, బలవన్మరణాలకు గురైన కేసుల్లో బాధితుల కుటుంబాలకు రిలీఫ్ ఇవ్వలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. ఎస్సీ ఎస్టీ స్పెషల్ మంత్లీ పెన్షన్ కి కూడా డబ్బులు ఇవ్వకపోవడం బాధాకరమని నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో 7 రోజులకే బాధితులకు రిలీఫ్ ఇవ్వాల్సి ఉందని, అయితే 9 నెలలు గడిచినా, రిలీఫ్ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ జిల్లాల్లో ఎంతెంత మొత్తం అవసరమో గుర్తించి, సదరు మొత్తాన్ని విడుదల చేయాలని సాంఘిక సంక్షేమ శాఖకు లేఖలు రాశారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ ఎస్టీ రిలీఫ్ బిల్లులకు సంబంధించి అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు ఫైనాన్స్ కు ఫైల్ సర్క్యులేట్ చేసిందన్నారు. రిలీఫ్ ఫైలు ఫైనాన్స్ ఆఫీసు నుంచి కదలటం లేదని నాగేంద్ర కన్నబాబు దృష్టికి తీసుకువచ్చారు. నీలం నాగేంద్ర రావు, సుజన్ మాదిగలు ప్రస్తావించిన అంశాలను నోట్ చేసుకున్న కన్నబాబు మాట్లాడుతూ, రిలీఫ్ బిల్లుల మంజూరులో అనివార్యంగా జాప్యం జరిగిందని అంగీకరించారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ వల్ల ఆలస్యమైందన్నారు. ఎస్సీ ఎస్టీ రిలీఫ్ బిల్లుల్ని క్లియర్ చేసేందుకు రాష్ట్రంలో 28 కోట్ల రూపాయల నిధులు అవసరత ఉందన్నారు. నవంబరు మూడో వారంలో రూ.14 కోట్ల రూపాయలు గ్రాంట్ రిలీజ్ చేస్తామని కన్నబాబు తెలిపారు. మిగిలిన రూ.14 కోట్ల రూపాయలను కూడా వీలైనంత త్వరగా మంజూరు చేసి, ఎస్సీ ఎస్టీ రిలీఫ్ బిల్లుల్ని క్లియర్ చేస్తామన్నారు.

# ఆన్‌లైన్ పరీక్షల్లో పాల్గొన్న దామచర్ల సక్కుబాయమ్మ కళాశాల విద్యార్థులు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)**

దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో "జవహర్ నాలెడ్జ్ కేంద్రం- సరికొత్త నైపుణ్యాలు తో" దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) , జవహర్ నాలెడ్జ్ కేంద్రం, ఒంగోలు సంయుక్తంగా నిర్వహించిన స్పోకెన్ ట్యుటోరియల్ ఆన్‌లైన్ టెస్ట్ ఈ నెల 3న, ఐఐటీ ముంబైకి చెందిన స్పోకెన్ ట్యుటోరియల్‌లో ఆన్‌లైన్ పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తేదీ01.07.2024 న కోర్సుల్లో నమోదు చేసుకొని, 03.10.2024 న ఆన్‌లైన్ పరీక్షను పూర్తి చేశారు. ఈ మూడుల్ ఎల్ఎంఎస్(లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్) సర్టిఫికేట్ కోర్సులో 49 మంది విద్యార్థులు పాల్గొనగా, 48 మంది విజయవంతంగా ఉత్తీర్ణత సాధించారు. ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. కళ్యాణి అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో 49 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. కళ్యాణి మాట్లాడుతూ, విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్లను సద్వినియోగం చేసుకోవాలి, ప్రాముఖ్యతను వివరించారు, "ఇప్పటి తరం విద్యార్థులు టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవడం చాలా అవసరం. మేధస్సు, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి, జీవితాన్ని మరింత సులభతరం చేసుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధారిత అప్లికేషన్లు ఎంతో దోహదం అవుతాయి." ఆమె ఏఐ అప్లికేషన్ల ప్రాముఖ్యతను గుర్తిస్తూ, "విద్యార్థులు చాట్ జీపీటీ, జెమిని, కో పైలట్, గ్రామర్లీ, అలెక్సా, లెన్సా, మెటా వంటి ఎన్నో అప్లికేషన్లను ఉపయోగించుకోవడం ద్వారా తమ జీవితాలను మారుతాయి అని ఆమె అన్నారు. ఈ అప్లికేషన్లు విద్యా రంగం నుంచి మొదలుకొని దైనందిన జీవితానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంతో సహాయం చేస్తాయి" అన్నారు. డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ అప్లికేషన్ల వినియోగం ఎలా సహాయపడుతుంది అని విద్యార్థులకు తెలియచేసారు ? చాట్‌జీపీటీ వంటి అప్లికేషన్లు విభిన్న ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో సహాయపడతాయి. జెమినీ, కోపైలట్ వంటి టూల్స్, సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లు, కంటెంట్ క్రియేటర్‌లకు అనుకూలంగా ఉండి, వారి పనిని వేగంగా, సులభంగా చేస్తాయి. గ్రామర్లీ విద్యార్థులకు మరియు రైటర్‌లకు మంచి వ్యాకరణంతో వ్రాయడం సులభం చేస్తుంది. అలెక్సా లాంటి వాయిస్ అసిస్టెంట్‌లు అనేక రకాల పనులను వేగవంతంగా నిర్వహించడంలో సహాయపడతాయి. లెన్సా వంటి అప్లికేషన్లు ఫోటోలను సృజనాత్మకంగా ఎడిట్ చేయడంలో సహాయపడతాయి. మెటా వంటి అప్లికేషన్లు సోషల్ మీడియా అనుభవాలను మరింత సంతృప్తిగా మార్చి, కమ్యూనికేషన్‌ను మెరుగుపరుస్తాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ డి కళ్యాణి చివరిగా, "ఈ ఆధునిక అప్లికేషన్లను సరిగ్గా ఉపయోగిస్తే విద్యార్థుల భవిష్యత్తు ఎంతో వెలుగొందుతుంది. మనం అందుబాటులో ఉన్న టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవడమే కీలకం" అని పేర్కొన్నారు. జవహర్ నాలెడ్జ్ కేంద్రం పర్యవేక్షకురాలిగా డాక్టర్ ఏవీ రాజ్యలక్ష్మి వ్యవహరించగా, జేకేసీ ఫుల్ టైమ్ మెంటర్ జేవీ సురేష్‌కుమార్ ఈ కోర్సులను నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి కళ్యాణి జవహర్ నాలెడ్జ్ కేంద్రం ద్వారా విద్యార్థుల కంప్యూటర్ నైపుణ్యాల అభివృద్ధి కోసం జేకేసీ టీమ్‌ను అభినందించారు.

## నూతన ఇంద్ర బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల







**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం మున్సిపాల్టీ, అక్టోబర్ 4)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మార్కాపురం ఆర్టీసీ డిపోకు చెందిన రెండు ఇంద్ర నూతన బస్సులను మార్కాపురం ఆర్టీసీ బస్ స్టాండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు ఇంద్ర బస్‌లు మార్కాపురం నుండి హైదరాబాదుకు నూతన బస్సులు నడపడం తో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు అత్యంత సౌలభ్యంగా ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్వయంగా బస్సులను కొంతసేపు నడిపి ప్రజలను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఆర్టీసీ డిఎం, మార్కాపురం పట్టణ తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## వీఆర్ఓ సామేలుకు సత్కారం



**(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, అక్టోబర్ 4)**

మండల కేంద్రమైన మర్రిపూడి వీఆర్వోగా పనిచేస్తున్న సామేలు బదిలీ పై వెళ్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం తాసిల్దార్ జ్వాలా నం సింహారావు, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు గొంటు హను మారెడ్డి, ప్రకాశం జిల్లా మాదిగ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షులు గురిజాల బాబురావు మాదిగలు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పొదిలి మండలం ఆముదాలపల్లి విఆర్ఓగా ఆయన బదిలీ అయ్యారు. మార్కాపురం టౌన్ వీఆర్ఓగా పని చేస్తున్న బడే సాహెబ్ మర్రిపూడి విఆర్ఓగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

## నాయుడుపేట ఎంపీడీవోగా కె సురేష్ బాబు



**(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, అక్టోబర్ 4)**

నాయుడుపేట నూతన ఎంపీడీవోగా కె సురేష్ బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శాలువాలు కప్పి, పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎంపీడీవో సురేష్ బాబు సమస్యల పరిష్కారం కోసం వచ్చేవారిని నవ్వుతూ మాట్లాడి వారి సమస్యకు పరిష్కారం చూపడం మనందరి బాధ్యత అని అన్నారు. ప్రజా ప్రతినిధులు, పాలక మండలి సహకారంతో మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు.

## నాయుడుపేట మున్సిపాలిటీ కమిషనర్ ఎస్కే ఫజులుల్లాను ఘనంగా సన్మానించిన కార్మిక సంఘ నేతలు



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జి, అక్టోబర్ 4)**

నాయుడుపేట మున్సిపాలిటీ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.కె ఫజులుల్లా ను మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు చాపల వెంకటేశ్వర్లు కార్మికులు కలిసి శాలువా పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పరిష్కారం కొరకు ఆయనతో చర్చించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నెలవల హరికృష్ణ, మధు, వెంకటరత్నం, తేజ, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య విభాగంలో ఉన్న మేస్త్రీలను కొనసాగించాలి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)**

పారిశుద్ధ్య విభాగంలో ఉన్న మేస్త్రీలు కొనసాగించాలని మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. స్థానిక ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్తుల్ని విధుల్లోకి తీసుకోవాలని నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది .ఈ కార్యక్రమానికి కె ఆదినారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె సామ్రాజ్యం మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి మేస్త్రీలు కొనసాగుతున్న కార్మికుల్ని .ఈరోజు ప్రభుత్వాలు ,అధికారులు వ్యవస్థని మార్చడం అనేది సరైన విధానం కాదని మరియు రాష్ట్రంలో ప్రతి మున్సిపల్ ,కార్పొరేషన్ లో మేస్తుర్ల కార్మికులు సంఖ్యకి అనుగుణంగా ఉన్నారని మన ఒంగోలు కార్పొరేషన్ మేస్త్రిన్గా ఉన్న కార్మికుల్ని సంఖ్యకు, మేస్తులుగా ఉన్న కార్మికుల్ని విధులను ఆపడం అనేది సరైన కాదని వ్యక్తం చేశారు.యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి .మహేష్ మాట్లాడుతూ ఒంగోలు కార్పొరేషన్ కార్పొరేషన్ లో దాదాపు మేస్తుర్లుగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు ముందస్తు ఎలాంటి సమాచారం లేకుండా ఒక్కసారిగా మీరు పారిశుద్ధ్య పనికి వెళ్లాలని సైడ్ కాలువలు ,చీపుర్లు పట్టాలని అధికారులు చెప్తున్నారు మరియు మేస్త్రిలు సంఖ్య ఎక్కువగా ఉందని వైట్ కలర్ లో ఎక్కువ మంది ఉన్నారని కారణాలు చెబుతూ .దాదాపు 11 రోజుల నుండి మేస్తులకే వ్యవస్థని రద్దు చేశామని మాస్టర్ వేయకుండా ఆబ్సెంట్లు వేస్తున్నారు ఇది సరైన పద్ధతి కాదన్నారు. మేస్త్రీ పనిల తీసుకునేటప్పుడే మేస్త్రిలుగా అవసరం లేదు కార్మికులు కావాలని చెప్పాలి ఇప్పుడు, గత 15 ఏళ్ల నుంచి మేస్త్రిలుగా విధులు నిర్వహిస్తూ కార్మికులకు, డివిజన్ పరిధిలో ప్రజలకు, ప్రజాప్రతినిధులకు సమన్వయకర్తగా ఉండే విధులు నిర్వహిస్తున్నారు. ఎలాంటి సమాచారం లేకుండా అర్ధంతంగా మీరు అందరూ కార్మికులే సైడ్ కాలవలు, చెత్త, చీపురు పట్టుకొని రోడ్లు ఉడవాలని అధికారులు చెప్పడం అయిందనేది సరైనది కాదని అన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ లో సమస్యలు పరిష్కారాన్ని చూపే మార్గంలో కార్మికులకు ఉపాధి కొనసాగించే పద్ధతిలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు చేయాలని వారిని విధుల్లో కొనసాగించాలని మేస్త్రిలుగా పనిచేస్తున్న కార్మికులను విధుల్లో కొనసాగించాలని లేనిపక్షంలో ఆందోళన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నగర కార్యదర్శి టి విజయమ్మ కార్మికులు విజయ, జగదీష్ ,హరిబాబు, వెంకట్రావు రమేష్ ,అనిల్ గోపి, హనుమంతరావు, ఆనంద్ రావు, శ్రీనివాసరావు ,మనోహర్, తదితరులు పాల్గొన్నారు

## టిడిపి సీనియర్ కార్యకర్తల మరణం పార్టీకి తీరని లోటు

**వారి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుంది**





**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 4)**

మాచర్ల మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన పసుపులేటి బ్రహ్మనాయుడు మరణ వార్త తనను బాగా కలచి వేసిందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువ నాయకుడి ఆకస్మిక మరణం పార్టీకి తీరనిలోటుని అన్నారు. తాళ్లపల్లి గ్రామంలో బ్రహ్మనాయుడు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ అండగా ఉంటుందని బ్రహ్మనాయుడు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. మాచర్ల పట్టణానికి చెందిన మాజీ పట్టణ అధ్యక్షుడు వడ్డెర సంఘం నాయకులు బాలశౌరి మరణం పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే బ్రహ్మ రెడ్డి అన్నారు. బాలశౌరి నివాసానికి వెళ్లి ఆయన పార్థివ దేహం పై తెలుగుదేశం పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. పార్టీ నాయకులు కొమ్మెర దుర్గారావు ఎనుముల కేశవరెడ్డి విద్యాధరణి మురళి సంబోజు వేణు అనంత రాములు కజం సైదయ్య నేరెళ్ల వీరస్వామి గుండాల శ్రీనివాసరావు కొమ్మెర శివ జూలకంటి వెంట ఉన్నారు.

## చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో వైభవంగా శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు

**గాయత్రి దేవి అలంకారంతో**

**భక్తులకు దర్శన భాగ్యం కలిగించిన పార్వతీ అమ్మవారు**

**షోడోపచార పూజలతో భక్తులను అనుగ్రహించిన వాసవి అమ్మవారు**

**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, అక్టోబర్ 4)**

చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు శుక్రవారం అమ్మవారు శ్రీ గాయత్రి దేవి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మి పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ వాసవి అమ్మవారికి పాంచామృత సుగంధ ద్రవ్యాల అభిషేకాలు నిర్వహించి తదుపరి అమ్మవారికి శ్రీ చక్రార్చన సాయంత్రం ఉభయదాతలచే కుంకుమార్చన, అర్యవైశ్య మహిళలచే సామూహిక శ్రీ లలితా సహస్ర నామ సోస్త్రం, పారాయణం, శ్రీ చక్రార్చన, నవావరణ పూజ, శ్రీ పార్వతీ సమేత నగేశ్వరస్వామి వారికి పంచామృత అభిషేకాలు, నైవేద్యం, మహాహారతి, తీర్థప్రసాదాల భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి చేసిన షోడశోపచార అలంకరణతో భక్తులను కనువిందు చేసింది. శనివారం అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శన భాగ్యం కలిగిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా పెద్దబాబు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు, కొణిజేటి సువర్ణ, గాదంశెట్టి లక్ష్మి, చలువాది మాధవి, కూరపాటి ధనలక్ష్మి, దాట్ల సువర్చల, ఏ అరుణ, శిద్దా లక్ష్మి పద్మజ, మహిళా భక్తులు పాల్గొన్నారు.







## విజయవాడ వరద బాధితులకు రూ.50 వేలు సాయం ప్రకటించిన వెంకటాచలం శ్రీ పద్మావతి హోటల్ నిర్వాహకులు

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 4)**

విజయవాడ వరద బాధితులకు రూ.50 వేలు సాయంను వెంకటాచలం శ్రీ పద్మావతి హోటల్ నిర్వాహకులు ప్రకటించారు. చెక్కును సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి అందజేసిన కుడితిపూడి మురళీధర్ నాయుడు, కుడితిపూడి వెంకటేష్ నాయుడు, కుడితిపూడి అశోక్ కుమార్, కుడితిపూడి శ్రీనివాసులు నాయుడు ఉన్నారు. దాతలను అభినందించిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వరద బాధితులకు అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.



## అథ్లెటిక్స్ మహిళా విభాగంలో

# దూసుకుపోతున్న ప్రకాశం జిల్లా జట్లు









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)

యుటిఎఫ్ రాష్ట్రస్థాయి ఆటల పోటీలలో అథెటిక్స్ మహిళా విభాగంలో ప్రకాశం జిల్లా జట్లు దూసుకుపోతున్నాయి. ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా గుంటూరు నగరంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ, ఉపాధ్యాయినీ ఆటల పోటీలలో ప్రకాశం జిల్లా నుండి వివిధ క్రీడా విభాగాల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. మహిళా విభాగం షార్ట్పుట్‌లో రాష్ట్రస్థాయి మొదటి, ద్వితీయ స్థానాలను షేక్ మహిబూన్, ఎం సృజన అందుకున్నారు. 100 మీటర్ల రన్నింగ్ లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం ఎస్‌కె మెహబూన్, 45 సంవత్సరాల పై విభాగంలో 100 మీటర్ల స్థాయి మొదటి బహుమతి కే జగదీశ్వరి, రాష్ట్రస్థాయి తృతీయ బహుమతి వి కవిత, మహిళల విభాగంలో 400 మీటర్లు స్పీడ్ వాక్ 45 సంవత్సరాల పైబడిన వారిలో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి వి కల్పన, రాష్ట్రస్థాయి తృతీయ బహుమతి వి కవిత, 200 మీటర్లు రాష్ట్రస్థాయి ద్వితీయబహుమతి ఎస్కే మహిబూన్, పురుషుల క్రికెట్ విభాగంలో ప్రకాశం జిల్లా టీం నెల్లూరు జిల్లా టీం పై గెలుపొంది క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ఈ ఆటల పోటీల నిర్వహణలో గెలుపొందిన క్రీడాకారులు అందరికీ యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ పక్షాన అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి ఆటల పోటీలను యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమోజు శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు పర్యవేక్షించారు. ప్రకాశం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ రవి ప్రకాశం జిల్లా క్రీడల కమిటీ కన్వీనర్ షేక్ అబ్దుల్ హై, ప్రకాశం జిల్లా సహాధ్యక్షురాలు జి ఉమామహేశ్వరి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పి రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి డి వెంకట్‌రెడ్డి, పి బాల వెంకటేశ్వర్లు, పి బాబు నాయక్, జ్యోతి, ఎం సంధ్యారాణి, కటకం విజయభాస్కర్, ఆర్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్

### ఒంగోలు కలెక్టరేట్ వద్ద సిపిఎం నిరసన



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)

ఎన్నికల ముందుకు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద ప్రభుత్వం ఇచ్చిన ఇసుక ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం శుక్రవారం జరిగింది. విరసన కార్యక్రమానికి సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి జి.రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక బంగారం అయిందని, ఎక్కడా దొరకటం లేదన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజులలో రాష్ట్రంలోని ఇసుక నిల్వలన్ని అధికార పార్టీ నాయకులు తీసుకుపోయారన్నారు. సామాన్యులకు ఇసుక దొరకక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రాక్టర్ ఇసుక 1500 నుంచి రూ.2500లకు అమ్ముతున్నారన్నారు. ఇసుక దొరకక బిల్డర్లు, గృహ యజామానులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక అల్లాడిపోతున్నారని, వారికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గనులు, భూగర్భ జలశాఖ అధికారులు రాష్ట్రంలో 190 ఇసుక రీచ్లను గుర్తించామని 11 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో తెస్తామని చెబుతున్నారన్నారు. అధికారులు చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రాజకీయాలకు అతీతంగా ఉచిత ఇసుకను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం చేసిన తప్పులు చేయవద్దని ఆయన హితవుపలికారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుకను అందజేని ప్రజలను అదుకోవాలని కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేస్తామని సయ్యద్ హనీఫ్ హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదరి వర్గ సభ్యులు షేక్ మాబు, జీవి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీమకుర్తి మండల పార్టీ కార్యదర్శి పూసపాటి వెంకట్రావు, టంగుటూరు మండల పార్టీ కార్యదర్శి మోజేష్, కొండపి మండల పార్టీ కార్యదర్శి కెజి మస్తాన్ ప్రసంగించారు. కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, పి కల్పన, వి బాలకోటయ్య, జి శ్రీనివాసులు, బి రఘురామ్, తంబి శ్రీనివాసులు, బంకా సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు, ఒంగోలు నగర కమిటీ సభ్యులు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గ పార్టీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జమీన్ రైతు పత్రిక సంపాదకులు, సీనియర్ జర్నలిస్టు నెల్లూరు డోలేంద్ర ప్రసాద్‌కు మాతృవియోగం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 4)

జమీన్ రైతు పత్రిక సంపాదకులు, సీనియర్ జర్నలిస్టు నెల్లూరు డోలేంద్ర ప్రసాద్‌కు మాతృవియోగం కలిగింది. డోలేంద్ర ప్రసాద్ తల్లి లలితమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. లలితమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబసభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్నారు.

# గాజాలో దాడులు ఆపాలి

## 7న జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయండి

### వామపక్ష పార్టీల పిలుపు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)

గాజాపై ఇజ్రాయిల్ ఆటవిక దాడులు మొదలుపెట్టి ఏడాది అవుతున్న సందర్భంగా తక్షణమే యుద్ధాన్ని ఆపాలని, కాల్పుల విరమణ జరిపి ఘర్షణలకు స్వస్తి పలకాలని కోరుతూ ఈనెల 7వ తేదీన వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో శుక్రవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎంఎస్ సాయి మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయేల్ హమాస్ దాడికి ప్రతీకార దాడి పేరుతో ఇజ్రాయిల్ పాలిస్తానపై వివక్షణారహితంగా క్రూరమైన దాడులకు దిగింది అన్నారు. ఫలితంగా 42 వేల మందికిపైగా పాలస్తీనీయులు మరణించారన్నారు. వీరిలో మహిళలు, చిన్నారులు ఎక్కువగా ఉన్నారన్నారు. వాస్తవానికి ఈ సంఖ్య ఆగస్టు 6 నాటికి 85 వేల కు పైగా ఉండవచ్చని ప్రముఖ మెడికల్ జనరల్ జర్నల్ లాన్సింగ్ అంచనా వేసింది అన్నారు.ఇందులో ప్రత్యక్ష, పరోక్షం మరణాలు రెండు ఉన్నాయన్నారు. ఇజ్రాయిల్ ఈ మతోన్మాద చర్యలు జాతి నిర్మూలనకు దారితీస్తుందని జనవరిలో అంతర్జాతీయ న్యాయస్థానం వ్యాఖ్యానించిందన్నారు. కాల్పుల విరమణ కోసం జరుగుతున్న అర్థవంతమైన అన్ని చర్చలను ఇజ్రాయిల్ తోకేస్తూ మరోవైపు ఏడాది పొడుగునా దాడి కొనసాగిస్తుందని పేర్కొన్నారు. గాజాలో ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న ఊచ కోత, రాక్షసత్వాన్ని నిరసిస్తూ తక్షణమే యుద్ధాన్ని ఆపాలని, కాల్పుల విరమణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో, జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ నిరసన కార్యక్రమాలలో ప్రజలు ఎక్కువగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు కె వీరారెడ్డి, కొత్తకోట వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు జీవి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు ప్రజలకి అందుబాటులో రాజా ఫర్నీచర్...

### ప్రజల టేస్ట్ గా తగ్గట్టుగా ఫర్నీచర్ ఏర్పాటు

### భవిష్యత్‌లో మరెన్నో నూతన బ్రాంచ్‌లను ప్రారంభించాలి

### రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

### నెల్లూరు నర్తకి సెంటర్‌లో రాజాఫర్నీచర్ మూడో షోరూమ్‌ను ప్రారంభించిన మంత్రి

### మంత్రికి ఘన స్వాగతం పలికిన రాజా ఫర్నీచర్ నిర్వాహకులు



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 4)

గత 25 ఏళ్లుగా నెల్లూరు జిల్లా ప్రజానికి ఫర్నీచర్ రంగంలో రాజా ఫర్నీచర్ నిర్వాహకులు మంచి సేవలు అందిస్తూ...అందరి మన్ననలు పొందుతున్నారని...రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కొనియాడారు. నెల్లూరు నగరం నర్తకి సెంటర్‌లో...రాజా ఫర్నీచర్ నిర్వాహకులు రాజా మల్లికార్జునరావు, రాజశేఖర్, రాజా శ్రీనివాసరావు, రాజా హజరత్‌బాబులు...మూడో షోరూమ్‌ను నూతనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. ముందుగా మంత్రి నారాయణకి...షోరూమ్ నిర్వాహకులు పూలబొకేలతో స్వాగతం పలికి...శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. నెల్లూరు నర్తకి సెంటర్లో రాజా ఫర్నీచర్ ను మూడో షోరూమ్ ను ఓపెన్ చేశరాన్నారు. గత 25 ఏళ్లుగా ఈ బిజినెస్ చేస్తున్నారన్నారు. రాజా మల్లికార్జునరావు, రాజశేఖర్, రాజా శ్రీనివాసరావు, రాజా హజరత్‌బాబులు సమర్ధవంతంగా పని చేస్తూ...నెల్లూరు ప్రజలకి అందుబాటులో ఉంటూ మంచి సేవలు అందిస్తున్నారని కొనియాడారు. రోజు రోజుకి అన్నీ రంగాల్లోనూ మార్పులు వస్తున్నాయన్నారు. అదే విధంగా గత 25 ఏళ్లలో ఫర్నీచర్ రంగంలోనూ అనేక మార్పులు జరిగాయన్నారు. ప్రజలకి అనుగుణంగానే...ఫర్నీచర్‌ను తీసుకు వచ్చి అందచేయడం వల్లే...తమ వ్యాపారం అభివృద్ధి చెందుతుందని రాజా ఫర్నీచర్ నిర్వాహకులు తెలిపారన్నారు. జీ ప్లస్ 5 మొత్తం ఆరు ఫ్లోర్‌లలోనూ అనేక రకాల అత్యాధునిక ఫర్నీచర్‌ను ప్రజలకి అందుబాటులో ఉంచారన్నారు. ప్రపంచంలో ఎక్కడ పోర్ట్ ఉంటే ఆ సిటీ బాగా డెవలప్ అవుతుందన్నారు. ముంబాయి, కోల్‌కత్తా, చెన్నై, కొచ్చిన్ లలో పోర్ట్ లు ఉండడం వల్లే ఆ కంట్రీలన్నీ ఎంతో అభివృద్ధి చెందాయని చెప్పారు. ఈ నేపథ్యంలో మన నెల్లూరులో కూడా కృష్ణపట్నం పోర్ట్ ఉందని...త్వరలోనే నెల్లూరు కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. నెల్లూరులో రాజా ఫర్నీచర్ షోరూమ్‌లు మరెన్నో ఓపెన్ చేయాలని...వారి బిజినెస్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నెల్లూరు సిటీని ఎంతో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. అయితే 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ముఖ్యంగా దోమలు లేని నెల్లూరు నగరంగా తీర్చిదిద్దేందుకే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌ని తీసుకువచ్చానన్నారు. అలాగే నగర ప్రజలందరికి స్వచ్ఛమైన నీటిని అందించాలన్న ఉద్దేశంతోనే డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టును కూడా 90 శాతం పూర్తి చేశామన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలంటే రూ. 200 కోట్లు అవసరం ఉంటుందని... వాటిని త్వరతగతిన పూర్తి చేయాలని ఇప్పటికే అధికారుల్ని ఆదేశించడం జరిగిందన్నారు. ఇప్పటికే ఆ కాంట్రాక్టర్లకు డబ్బులు కూడా రిలీజ్ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతానికి రాష్ట్ర ఖజానా ఖాళీ అని...అయినా కూడా రాష్ట్రాభివృద్ధిని చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనుభవంతో ముందుకు తీసుకెళ్లేందుకు ఎంతో కష్టపడుతున్నారన్నారు. నెల్లూరు నగర ప్రజలకి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ఖచ్చితంగా పూర్తి చేసి తీరుతానని...అందుకు కొంచెం టైం కావాల్సి ఉంటుందని నారాయణ ప్రజల్ని రిక్వెస్ట్ చేశారు.

## రాజా ఫర్నీచర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

### నెల్లూరు ప్రజలకు అందుబాటు ధరల్లో రాజా ఫర్నీచర్

### భవిష్యత్‌లో మరిన్ని బ్రాంచ్‌లు ప్రారంభించాలి







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 4)

నెల్లూరు ప్రజలకు రాజా ఫర్నీచర్స్ మంచి సేవలు అందించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆకాంక్షించారు. నెల్లూరు నగరం నర్తకి సెంటర్‌లో రాజా ఫర్నీచర్ నిర్వాహకులు రాజా మల్లికార్జునరావు, రాజశేఖర్, రాజా శ్రీనివాసరావు, రాజా హజరత్‌బాబు మూడో షోరూమ్‌ను ఏర్పాటు చేయగా.. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి షోరూమ్ నిర్వాహకులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. షోరూమ్ అంతా కలియదిరిగి ఫర్నీచర్ కలెక్షన్లను పరిశీలించారు. షోరూమ్ నిర్వాహకులు గత 25 ఏళ్లుగా ఈ బిజినెస్ చేస్తున్నారన్నారు. రాజా మల్లికార్జునరావు, రాజశేఖర్, రాజా శ్రీనివాసరావు, రాజా హజరత్‌బాబులు సమర్ధవంతంగా పని చేస్తూ...నెల్లూరు ప్రజలకి అందుబాటులో ఉంటూ మంచి సేవలు అందిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని బ్రాంచ్‌లు ప్రారంభించాలని ఆమె ఆకాంక్షించారు.

## స్విమ్స్ ఆధ్వర్యంలో మిజూరు సచివాలయం పరిధిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్





(షణ్ముఖ వెలుగు, దొరవారి సత్రం, అక్టోబర్ 4)

తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం మీజూరు గ్రామ సచివాలయం పరిధిలో స్విమ్స్ శ్రీ బాలాజీ ఐనిష్టి ట్యూబ్ అఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం తొగరాముడి పిహెచ్‌సి పరిధిలోని మీజురు గ్రామంలో సచివాలయం దగ్గర నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు వినియోగం క్యాన్సర్‌కు కారణం అవుతుందన్నారు. 40 ఏళ్ల పైబడిన మహిళలందరూ మూడేళ్ల కోసారి రొమ్ము క్యాన్సర్ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్కానింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య సహకారంతో తిరుపతి జిల్లాల్లో పింక్ బస్సు ద్వారా మొబైల్ క్యాన్సర్ స్కానింగ్ వేగవంతంగా జరుగుతుందన్నారు .ఇందులో భాగంగా తోగా రాముడి పీహెచ్‌సి పరిధిలో క్యాన్సర్ స్కానింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాగా ఈ శిబిరంలో మహిళలు పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు మహిళలకు రొమ్ము క్యాన్సర్ గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ క్యాంపునకు విశేషంగా ప్రజలు వచ్చేసి క్యాన్సర్ స్కానింగ్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె రమణమ్మ, ఎంపీటీసీ బాలరాజు, పంచాయతీ కార్యదర్శి బి మధు, స్విమ్స్ శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య భాను, తరుణ్ సాయి కుమార్, పిహెచ్‌ఎన్ వరలక్ష్మి, సూపర్వైజర్ జనార్ధన్ రావు, విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి నీరజ, ఏఎన్‌ఎం సబిత, ఆశ వర్కర్స్ కళావతి, హైమావతి, ప్రభావతి, చెంగమ్మ పాల్గొన్నారు.

## కెవిపిఎస్ జెండా ఆవిష్కరణ



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, అక్టోబర్ 4)
కెవిపిఎస్ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, సుందరయ్య కాలనీ, బాపూజీ కాలనీలతో పాటు,భగత్ సింగ్ కాలనీ యందు కెవిపిఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. జెండా కార్యక్రమాన్ని సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జి.విక్టర్ ఆవిష్కరి ంచారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు జవాజి రాజు మాట్లాడుతూ ఆత్మగౌరవం ప్రజాస్వామ్యం దళితులను కాపాడు కునేందుకు కెవిపిఎస్ ఏర్పడిందన్నారు. ఈ ప్రాంతంలో సంఘం ఆధ్వర్యంలో దళితుల భూములను పెత్తనం దారులు ఆక్రమిస్తే వాటికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించామని చెప్పారు. దేశానికి స్వతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా దళితులు పేదలు బడుగు బలహీన వర్గాలు నివసించే ప్రాంతాల్లో స్మశానాలు లేవని వాటికోసం అనేక పోరాటాలు నిర్వహించి సుందరయ్య కాలనీ లాంటి ప్రాంతాల్లో దళితుల కోసం స్మశానాలను కేటాయించేందుకు పోరాటం నిర్వహించామని తెలియ జేశారు. దళిత మహిళలు పని ప్రదేశాల్లో అనేక అనేక అవమానాలకు అత్యాచారాలకు గురవుతున్నారని వాటికి వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో దళిత మహిళలకు అండగా ఉండడం జరిగిందన్నారు. తంగిరాల పల్లె, తాడివారిపల్లె అలాంటి గ్రామాల్లో దళితుల భూములను పెత్తనం దారులు స్వాధీనం చేసుకుంటే వారికి అండగా నిలవసి వారి భూమి ఇప్పించేందుకు అనేక పోరాటాలు నిర్వహించామని తెలియజేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు గురవయ్య, జమ్ముల నాగరాజు, బలుసు పాటి కాశయ్య, జవాజి విజయ్, కె.బాల గురవయ్య, జె గంగయ్య, సిఐటియు నాయకులు డీకే రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుమ్మా బాల నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మరపగుంట్ల పంచాయతీలో గ్రామసభలు




(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, అక్టోబర్ 4)
మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సంబంధించి 2025-26 సంవత్సరానికి మరపగుంట్ల పంచాయతీ లో పనులు గుర్తింపుకు గ్రామసభలను శుక్రవారం నిర్వహించారు. ఈ గ్రామసభలో ఉపాధి హామీ పథకంలో చేసే వివిధ రకాల పనుల గురించి వివరించడమైనది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకట రెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి ముత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ కేలం రాజేశ్వరి, నాయకులు కర్ణాటి భాస్కర్ రెడ్డి, సానా జయపాల్ రెడ్డి, ఒంగోలు శ్రీనివాసులు, యడ్ల కొండా రెడ్డి, ఏపీవో శ్రీనివాస్ నాయక్, ఈసీ మనోహర్, టెక్నీకల్ అసిస్టెంట్ జోయల్ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ కేలం బాలిరెడ్డి ఇంకా ఈ గ్రామ సభలలో సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మిరప పొలాలను పరిశీలించిన కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ బృందం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, అక్టోబర్ 4)
మండలంలోని తిప్పాయపాలెం రైతుసేవా కేంద్రం నందు ఉద్యానవన శాఖ అధికారి రమేష్ అధ్యక్షతన కేంద్ర వ్యవసాయ బృందంచే ప్రస్తుతం సాగులో ఉన్న మిరప పంటల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీమ్ డైరెక్టర్ సన్నీ శేఖర్ ఆనంద్ మిరప సాగులో రైతులు ఆచరిస్తున్న సస్యరక్షణ చర్యల గురించి, మిరప పంటలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకోసం కేంద్ర ప్రభుత్వం పురుగు మరియు తెగుళ్ల నివారణకు సంబంధించి ఎన్‌పీఎస్ఎస్ అనే యాప్ రొపొందించిందని తెలియజేశారు. ఈ యాప్ ద్వారా రైతులు ఫోటో తీయడం ద్వారా, తమ పొలాల యందు వచ్చే పురుగులు, తెగుళ్లను గుర్తించి, వెంటనే దాని నివారణకు గల సూచనలు యాప్ లోనే చూపిస్తుందని, తదనుగుణంగా పరుగు, తెగులు మందులు వాడవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సంయుక్త, మేఘన, ఆర్.యస్.కె సిబ్బంది శివశంకర్ నాయక్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## హథీరాంబాబా మఠాన్ని సందర్శించిన మంత్రి ఆనం





(షణ్ముఖ వెలుగు, తిరుపతి, అక్టోబర్ 4)
తిరుమల సమీపంలోని హథీరాంబాబా మఠాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి పూర్ణకుంభంతో మఠం నిర్వహకులు ఘన స్వాగతం పలికారు. హథీరాంబాబాతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారు పాచికలాడిన విశేషాలు, మఠం యొక్క ప్రాశస్త్యం గురించి మంత్రికి అర్చక స్వాములు క్లుప్తంగా వివరించారు. అనంతరం శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానం వద్ద స్థానిక భక్తులతో మాట్లాడారు. తదుపరి జాపాలి ఆంజనేయ స్వామి గుడిని దర్శించి స్వామి వారి ఆశీస్సులు స్వీకరించారు.

# ఇసుక దోపిడీలో ఏ1 కాకాణే

### సూరాయపాళెం, విరువూరు రీచ్‌లలో రూ.91 కోట్ల దోపిడీ తేలింది
### ఇది పదో వంతు మాత్రమే
### వైసీపీ పాలనలో కాకాణికి తెలియకుండా
### సర్వేపల్లి నుంచి ఇసుక రేణువు కూడా కదిలే అవకాశమే లేదు
### ఐదేళ్లలో జరిగిన దోపిడీపై సమగ్ర విచారణ జరిగితే ఎన్ని వందల కోట్లు తేలుతుందో
### దోపిడీ సొత్తును వడ్డీతో సహా కక్కించే వరకూ ఊరుకోను
### నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో
### మీడియాతో పొలిట్ బ్యూరో సభ్యులు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 4)
సర్వేపల్లి నియోజకవర్గంలోని పెన్నా తీరాన సూరాయపాళెం, విరువూరు రీచ్‌లు ఉన్నాయి.. ఈ రెండు రీచుల్లో గత ప్రభుత్వ హయాంలో అక్రమ మైనింగ్ జరిగిందని అధికారులు నిర్ధారించారు. సూరాయపాళెంలో సర్వే చేసి రూ.54.70 కోట్లు ఫెనాల్టీ విధించారు. 2,73,500 టన్నుల ఇసుకను అక్రమంగా తవ్వి తరలించినట్లు తేల్చారు. ఇది కేవలం 2023 డిసెంబర్ నుంచి ఎన్నికల ఫలితాలు వచ్చిన జూన్ 4వ తేదీ వరకు జరిగిన దోపిడీ మాత్రమేనని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. విరువూరు రీచ్ లోనూ అక్రమాలను నిర్ధారించి రూ.37 కోట్లు ఫెనాల్టీ వేశారు. ఇక్కడ 185000 టన్నుల ఇసుకను దోచేశారని అధికారులు తేల్చిచెప్పారు. రెండు రీచుల్లో కలిపి రూ.91.70 కోట్లు విలువైన ఇసుకను దోచేశారని నిర్ధారణ అయిందన్నారు. జేపీ వెంచర్స్ తో కలిసి విరువూరుకు చెందిన వైసీపీ నేత బచ్చల సురేష్ కుమార్ రెడ్డి(చిన్ని) అక్రమంగా ఇసుక తరలించినట్టు తేలిందని పేర్కొన్నారు. అనుమతులు పొందిన చోట కాకుండా పరిధి దాటి వ్యవహరించి ఈ అక్రమాలకు పాల్పడ్డారు, 2019 నుంచి 2021 వరకు భారీగా అక్రమ మైనింగ్ జరిగినా దాని కొలతలు వేయలేదన్నారు. 2022లో వచ్చిన వరదల కారణంగా కొలతలు వేయలేకపోయామని అధికారులు తప్పించుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తెల్లారి నుంచే సూరాయపాళెం, విరువూరు రీచ్ ల నుంచి వందల కోట్ల విలువైన ఇసుకను లేపేశారు. ఒక్క ఇసుకే కాదు గ్రావెల్, మట్టి, క్వార్జ్ దేనినీ వదిలిపెట్టకుండా దోచేశారు. రైతుల పొలాలు సారవంతం చేసేందుకు క్యూబిక్ మీటర్ మట్టిని రూ.1కి ఇవ్వాలని గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన జీఓను సైతం దుర్వినియోగం చేశారు 5.75 లక్షల క్యూబిక్ మీటర్లకు రైతుల పేరుతో అనుమతులు పొంది సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువులోని గ్రావెల్ మొత్తాన్ని ప్రైవేటు లేఅవుట్లకు అమ్ముకున్నారు. నిబంధనల ప్రకారం వాణిజ్య అవసరాలకు మట్టి తోలితే క్యూబిక్ మీటరుకు రూ.231 చెల్లించాలి. ఈ విధంగా మట్టిలోనూ రూ.15 కోట్లకు పైగా దోపిడీకి పాల్పడ్డారు. నిత్యం సూరాయపాళెం రీచ్ లో రూ.100 కోట్ల దోపిడీ అంటూ పాటపాడే కాకాణి గోవర్ధన్ రెడ్డి దోపిడీపర్వం అధికారికంగా వెలుగులోకి వచ్చిందన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చే రోజుకి ముందు ఆర్నెళ్లలోనే రూ.100 కోట్లకు పైగా దోపిడీ జరిగిపోయిందని స్పష్టమైందన్నారు. మొత్తం ఐదేళ్లలో జరిగిన దోపిడీని నిగ్గుతేలిస్తే ఎన్ని వందల కోట్లు బయటపడుతుందో నేను కాకాణి గోవర్ధన్ రెడ్డిలా నోటికొచ్చినట్టు వాగడం లేదు..అలా వాగడం నాకు చేత కూడా కాదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారులు ఇచ్చిన రిపోర్టులు, షోకాజ్ నోటీసులు, సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన సమాచారంతోనే మాట్లాడుతున్నాను. వైసీపీ ప్రభుత్వంలో కాకాణి గోవర్ధన్ రెడ్డికి తెలియకుండా సూరాయపాళెం, విరువూరు రీచ్ ల నుంచి ఇసుక రేణువైనా కదులుతుందా? కాకాణి ఆదేశాలు లేకుండా సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువులతో పాటు కసుమూరు, రామదాసుకండ్రిగ, ఈదగాలి నుంచి గ్రావెల్ ఎత్తే దమ్ము ఎవరికైనా ఉందా...? గోవర్ధన్ రెడ్డికి సంబంధం లేకుండా వరదాపురం, మరుపూరు, మొగళ్లూరు, ముదిగేడు నుంచి క్వార్జ్ కదలించగలరా? మంత్రిగా గూడూరు నియోజకవర్గంలోని సిలికాను కూడా కాకాణి వదిలి పెట్టలేదుకాకాణి గోవర్ధన్ రెడ్డి చేసిన దోపిడీలో ఇప్పుడు 10 పైసలు భాగం మాత్రమే బయటపడిందన్నారు. ప్రజల సొత్తును సొంతం దోచేసిన కాకాణికి నిద్రలేచి నన్ను, మా నాయకుడు చంద్రబాబు నాయుడిని తిట్టే అర్హత ఎక్కడిదన్నారు. కరోనా హౌస్ లో కూర్చుని కలెక్షన్లు లెక్కపెట్టుకుంటూ సర్వేపల్లిని సర్వనాశనం చేసిన వ్యక్తి మాపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండటం దురదృష్టకరమన్నారు. ఇసుక స్కాంలో ఏ1 అయిన కాకాణిని తప్పించి ఆయన చెంచాలకు నోటీసులు ఇచ్చారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమ మైనింగ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిగే వరకూ ఊరుకోనన్నారు. కరోనా హౌస్ యజమాని కాకాణి కటకటాలు లెక్కపెట్టే వరకు వదలను. దోచిన సొత్తును వడ్డీతో సహా కట్టించే వరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని సోమిరెడ్డి స్పష్టం చేశారు.

## రైల్వే స్టేషన్ల అభివృద్ధి, బ్రిడ్జీల పనులు పూర్తికి జనరల్ మేనేజర్ హామీ











(షణ్ముఖ వెలుగు, విజయవాడ, అక్టోబర్ 4)
విజయవాడలోని రైల్వే ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో పార్లమెంటు సభ్యులతో రైల్వే మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సమక్షంలో రైల్వే అధికారులు ఏర్పాటు చేచేసిన సమావేశంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి పలు సమస్యలపై మాట్లాడారు. ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఒంగోలు -దొనకొండ నూతన రైలుమార్గం, కంభం -పోరుమామిళ్ళ నూతన రైలుమార్గం, నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైను నిర్మాణం సత్వర పూర్తితోపాటు పొదిలి, మర్రిపూడి స్టేషన్లను సదరు రెండు పట్టణాలకు దూరంగా కాకుండా దగ్గరగా నిర్మాణం, అన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు, రైల్ ఓవర్ బ్రిడ్జీలు - 3 లిమిటెడ్ సబ్ వేలు నిర్మాణం - ముఖ్యంగా ఒంగోలు స్టేషన్ అగ్రహారం గేటు ఎల్‌సీ నం.207 వద్ద లిమిటెడ్ సబ్ వే సత్వర నిర్మాణంతోపాటు ఒంగోలులో రైల్వే స్థలంలో ఇండ్లు నిర్మించుకొన్న గుడిసెవాసుల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఒంగోలు లో కేరళ ఎక్స్‌ప్రెస్ అయోధ్య- రామేశ్వరం స్పెషల్ ట్రైన్ తో పాటు టంగుటూరు, సింగరాయకొండ, దొనకొండ, కురిచేడు స్టేషన్‌లలో పలు రైళ్లు నిలపాలని కోరారు. సేతు బంధన్, గతి శక్తి ప్రాజెక్ట్ లలో నిర్మిస్తున్న పలు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు , రైల్వే అండర్ బ్రిడ్జి లు త్వరతగతిన పూర్తి చెయ్యాలని కోరారు. అందుకు రైల్వే జనరల్ మేనేజరు, విజయవాడ డివిజనల్ మేనేజరు సానుకూలంగా స్పందించి అన్ని పనులు పూర్తిచేయుటకు హామీ ఇచ్చారు.

## రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి

### సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా, సబ్ కలెక్టర్‌కు వినతి





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 4)
ఎన్నికల్లో టిడిపి కూటమి వాగ్దానం ప్రకారం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతూ శుక్రవారం నాడు కందుకూరు సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద సిపిఎం కందుకూరు నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. అనంతరం సబ్ కలెక్టర్ పూజ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం కందుకూరు నియోజకవర్గ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని, ఇల్లు కట్టాలంటే పేదలు రెండున్నర వెయ్యి నుంచి మూడున్నర వెయ్యి వరకు ట్రాక్టర్ ఇసుకకు ఖర్చు చేయాల్సి వస్తుందని, ఆ ఖర్చును భరించలేక కొత్త ఇండ్ల నిర్మాణాలన్ని ఆపివేశారని అన్నారు. ఇసుక విధానంలో గత ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి తేడా లేదని విమర్శించారు. నేటి నుండి ఇసుక బుకింగ్ ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టినా ఆచరణలో పేదలకు ఇసుక అందట్లేదన్నారు. ప్రజలందరికీ ఇసుక అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గినా మన దేశంలో పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గలేదని అన్నారు.క్రిమినల్ చట్టాలలో మార్పులు తెచ్చి ఉద్యమకారులు, ప్రతిపక్షాలపై నిర్బంధం పూనుకుంటున్నారని,ఈ విధానాలపై ప్రజలంతా చైతన్యమై అర్థం చేసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన అనంతరం సిపిఎం నాయకులు ఇసుక సమస్యపై సబ్ కలెక్టర్ పూజతో చర్చించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తో మాట్లాడి ఉచిత ఇసుక వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ధర్నాలో సిపిఎంగుడ్లూరు, ఉలవపాడు, కందుకూరు మండల కార్యదర్శులు జి వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, ఎస్ ఏ గౌస్ బాషా పాల్గొని మాట్లాడారు. ఈ ధర్నాలో సిపిఎం కందుకూరు పట్టణ నాయకులు టి వెంకటరావు, ఎస్ కే మల్లిక, ఎం పద్మ, గుడ్లూరు మండల నాయకులు దామా.కృష్ణయ్య, నేలటూరి తిరుపాలు, నాగేశ్వరరావు, రాపూరి మాల్యాద్రి, లింగసముద్రం మండల నాయకులు పొందూరి కొండమ్మ, మన్నం మాల్యాద్రి, ఉలవపాడు మండల నాయకులు చేవూరి లోకేష్, వలేటివారి పాలెం మండల నాయకులు దువ్వూరి జాన్, ఎం సుభాను, తదితరులు పాల్గొన్నారు.

## కిట్స్‌లో యాంటీ ర్యాగింగ్ అవేర్నెస్ ప్రోగ్రాం

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం, అక్టోబర్ 4)
స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కిట్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అన్న కృష్ణచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దారవీడు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ పిఅనిల్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ సెకండ్ ఇయర్ విద్యార్థిని విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవేర్నెస్ కలిగించారు. అలానే సెల్ ఫోన్స్ వాడకూడదు డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రంగనాయకులు, కళాశాల ఏవో బి ప్రభాకర్, వివిధ విభాగపు అధిపతులు పి రామ్మోహన్, డాక్టర్ జెవి అనిల్ కుమార్,కే రాముడు, కే కిషోర్‌బాబు, ప్రసన్న మురళి, జే రమణారెడ్డి, ఏ అమృతవల్లి, పి మనోహర్, ఫిజికల్ డైరెక్టర్స్ ఎన్ రంగస్వామి, ఎన్‌విఎస్ఎన్ అంజనీ కుమార్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.






## కోటి 30 లక్షల కరెన్సీ నోట్లతో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి అలంకరణ

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 4)
కోటి 30 లక్షల కొత్త కరెన్సీ నోట్లతో గిద్దలూరు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి అలంకరించారు. దేవాలయంలో శుక్రవారం శరన్నవరాత్రులలో భాగంగా ధనలక్ష్మి రూపంలో భక్తులకు అమ్మవారి దర్శనం ఇస్తున్నారు. కొత్త కరెన్సీ నోట్లతో ఆకర్షిస్తున్న ధనలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి భక్తులు తండోప తండాలుగా తరలివస్తున్నారు. ప్రతి సంవత్సరం ధనలక్ష్మి అమ్మవారిని కొత్త కరెన్సీ నోట్లతో అలంకరిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com


## కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతరెడ్డికి తృటిలో తప్పిన ప్రమాదం

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 4)

కొవూరు ఎమ్మెల్యే, నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతరెడ్డికి శుక్రవారం ఉదయం నెల్లూరు నగరంలో ఒక ఫర్నీచర్ షాప్ ప్రారంభం సందర్భంగా పెను ప్రమాదం నుండి బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే శుక్రవారం ఉదయం స్థానిక నర్తకి సెంటర్‌లోని ఫర్నీచర్ షాప్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఫస్ట్ ఫ్లోర్‌లోకి లిఫ్ట్ ద్వారా వెళ్లేందుకు ఆమెతో పాటు దాదాపు 20 మంది వెళ్లారు. 10 మందికి మించి లిఫ్ట్ కేపాసిటీ లేకపోవడంతో ఒక్కసారిగా విపరీతమైన శబ్దంతో పాటు పొగలు రావడంతో దుకాణంలో ఉన్న ప్రజలు అందరు లిఫ్ట్ దగ్గరకు పరుగులు తీశారు. అప్పుడే తేరుకున్న ప్రశాంతరెడ్డితో పాటు మిగిలిన వారు మెట్ల ద్వారా బయటపడ్డారు. సెకండ్, థర్డ్ ఫ్లోర్ దగ్గర కొద్దిపాటి సాంకేతిక లోపల వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని సమాచారం. వేమిరెడ్డి దంపతులు చేసిన అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు గురువారం రాత్రి రాజరాజేశ్వరి అమ్మవారికి దంపతులు 26 విశేష పూజలు చేసారని, వారు చేసిన ఆ పూజల వలన ఆమెతో పాటు మిగిలిన వారు బయటపడినట్లు చర్చించుకుంటున్నారు. ఫర్నీచర్ షాపు నిర్వాహకులతో పాటు అక్కడి ప్రజలు ఒక్క నిమిషం పాటు భయభ్రాంతులకు గురయ్యారు. ఆ పుణ్యదంపతులు చేసిన దైవ కార్యక్రమాల వలనే ఈ రోజు దేవుడు ఆమెను రక్షించడం కేవలం దైవానుగ్రహం అని ప్రజలు చర్చించుకోవడం కోసం మెరుపు.

## కార్యకర్తల కష్టాలు, కన్నీళ్లు అన్ని నాకు తెలుసు

## నిరంతరం ప్రజల్లో ఉండండి

ప్రజలకోసం పనిచేయండి

ప్రజలకు ఎవరు దగ్గరగా ఉంటారో వాళ్లే నాయకులు





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 4)

రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సమక్షంలో 22వ డివిజన్ కార్పొరేటర్ మూలే విజయ్ భాస్కర్ రెడ్డి, వారి మిత్ర బృందం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. కష్టకాలంలో పనిచేసిన ప్రతి నాయకుడికి, కార్యకర్త కి గౌరవం తగ్గకుండా చూసుకుంటామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి తెలిపారు. గతంలో నేను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు 26 డివిజన్లు కార్పొరేటర్లు, 18 గ్రామాల సర్పంచ్ లు, 12 ఎంపిటీసీలు, ఒక జడ్పీటీసీ ఏవిధంగా గెలిచామో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా 26 డివిజన్ల కార్పొరేటర్లు, 18 గ్రామాల సర్పంచ్ లు, 12 ఎంపిటీసీలు, ఒక జడ్పీటీసీ గెలిచి తీరుతామని ఎమ్మెల్యే కోటంరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. నిరంతరం ప్రజల్లో ఉండండి. ప్రజలకోసం పనిచేయండి. అన్నిరకాలుగా స్థానిక ఎమ్మెల్యే గా నేను ప్రోత్సహిస్తామన్నారు. నాకు ఓటు వేయని వారు, నాకు వ్యతిరేకంగా చేసినవాళ్లకు కూడా మీకు ఏమైనా సమస్యలు ఉంటే మీరు స్వేచ్ఛగా రండి. నా చేతిలో ఉంటే చేసే దానికి మీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కంటే సాయి బాబా, టీడీపీ నాయకులు కోటిరెడ్డి, యానాదిరెడ్డి, కొండలరావు, నరసింహులు, రాజేంద్ర యాదవ్, దేగ వెంకటరెడ్డి, ములే బాల వెంకటరెడ్డి, కర్నాటి మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వీరేపల్లి డాబా వద్ద ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీ కొట్టిన తుఫాన్

ఐదుగురుకు తీవ్ర గాయాలు






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 4)

మండల పరిధిలోని వీరేపల్లి హైవే నిర్వజ్ఞ డాబా వద్ద అద్దంకి నుండి తిరుపతి దర్శనానికి వెళుతున్న తుఫాన్ వెహికల్ వీరపల్లి డాబా దగ్గరకు వచ్చేసరికి టైర్ పంచర్ కావడంతో సైడ్ ఆగి ఉన్న కంటైనర్ వెనుక భాగం ఢీకొట్టింది. దీంతో డ్రైవర్, మిగిలిన ఐదుగురు ప్రయాణికులకు తీవ్రంగా గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్ ద్వారా నెల్లూరు జిల్లా కావలి ఏరియా హాస్పిటల్ కి వైద్య సేవలు నిమిత్తం చేర్చడం జరిగింది. ప్రమాద స్థలాన్ని ఉలవపాడు ఎస్ఐ కె అంకమ్మ సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నాం

### రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

### కోట్లాదిమంది భక్తుల మనోభావాలతో కూడుకున్న స్వామి వారి లడ్డూ కల్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టు వేసిన సిట్ ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయి

### మేము సిట్‌కు అన్ని ఆధారాలు అందజేస్తాం

(షణ్ముఖ వెలుగు, తిరుపతి, అక్టోబర్ 4)



సిబిఐ నుంచి ఇద్దరు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇద్దరు, ఎఫ్ఎస్ఎస్ఐఎ నుంచి ఇద్దరు సభ్యులను సిట్ లో నియమించమని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది... ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తరపున 9 మంది నిష్ణాతులైన రాష్ట్ర అధికారులు, నిపుణులను సిట్‌లో నియమించి ఉన్నాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మరి కొంతమంది ఉన్నత స్థాయి అధికారులు సిట్‌లోకి రావడం చాలా విస్తృత ప్రయోజనాలకి నాంది పలుకుతుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. స్వామి వారి లడ్డూల విషయంలో సిట్ ను విస్తృతపరిస్తే ప్రజల మనోభావాలకు తగిలిన గాయం మానేటటువంటి పరిస్థితి ఉంది... ప్రజల్లో విశ్వాసం కూడా పెరుగుతుందని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం తూచా తప్పకుండా పరిగణలోకి తీసుకుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్‌ను సిబిఐ ఎక్కడా కూడా తప్పు పట్టలేదు.. ఇంకా విస్తృతమైన విధానంలో పరీక్షలు చేయించమని మాత్రమే సూచించారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన వ్యక్తులు ఇవాళ మరింత మోసం చేసే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు ఎక్కడ కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పట్టలేదు. తప్పు పట్టిందే గత టిటిడి చైర్మన్ వైవీసుబ్బారెడ్డిని, వై వి సుబ్బారెడ్డి హయంలో తిరుమలలో అనేక అక్రమాలు జరిగాయన్నారు. గత ప్రభుత్వ పాలనలో తిరుమలలో అన్న ప్రసాదాలు, లడ్డు ప్రసాదాలు తక్కువ స్థాయికి దిగజారాయన్నారు. విజిలెన్స్ ఎంక్వయిరీని నిలుపుదల చేయండి.. విజిలెన్స్ ఎంక్వయిరీ జరగకూడదని కోర్టుకు వెళ్ళిన వ్యక్తే గతంలో టిటిడి చైర్మన్‌గా పనిచేసిన వైవి సుబ్బారెడ్డి తప్పు చేయకుండా ఉంటే విజిలెన్స్ ఎంక్వయిరీని ఎందుకు ఆపాలని కోరారో ఆయనకే తెలియాలన్నారు. టెండర్ల ప్రక్రియలో అనేక అక్రమాలకు పాల్పడింది గత వైసిపి ప్రభుత్వ హయాంలోనేనన్నారు. ఏఆర్ ఇండస్ట్రీస్ కు నెయ్యి సరఫరా చేసే ఆర్డర్లు ఇచ్చింది ఎవరు... కంపెనీ కోసం టెండర్ నిబంధనలను మార్చింది ఎవరు? మూడేళ్లు అనుభవం ఉండాల్సి ఉంటే ఒక సంవత్సరం ఉంటే చాలని, నెయ్యి సరఫరా చేసే కంపెనీ 800 కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉండాలి అని నిబంధన ఉంటే దానిని 1500 కి.మీ మార్చి ఏఆర్ ఇండస్ట్రీస్ కు నెయ్యి సరఫరా చేసే ఆర్డర్ ఇచ్చింది ఎవరన్నారు. ఏ ఆర్ డైరీ తో చీకటి ఒప్పందాలు చేసుకున్నది వై వి సుబ్బారెడ్డి, జగన్ రెడ్డి మాత్రమేనన్నారు. వైసిపి చేసిన అక్రమాలను రాష్ట్ర ప్రభుత్వంపై రుద్దాలని చూస్తున్నారని అన్నారు. టీటీడీలో గతంలో జరిగిన అన్ని అక్రమాలపై పూర్తిస్థాయిలో ఫైల్స్‌ను సిట్ కు అందజేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నాం. అన్ని ఆధారాలను సిట్‌కు సమర్పించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తిగా సహకరించేందుకు తమ ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. తిరుమల పవిత్రత, భక్తుల మనోభావాలను కాపాడటమే దృఢ సంకల్పంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి ఆనం స్పష్టం చేశారు.

# జగనన్న సైనికులం - ప్రజలకు సేవకులం

### అధైర్యపడాల్సిన పనిలేదు

### బూచేపల్లి పదవీ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, అక్టోబర్ 4)

అధికారం లేని సమయంలో, కష్టకాలంలో జగనన్న మాటను శిరోధార్యంగా భావించి, పిన్న వయసులో ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి కి సంపూర్ణ మద్దతు, తోడ్పాటును ఇస్తామని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఒంగోలు నూతన పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా అధ్యక్ష పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమంలో పాల్గొని చంద్రశేఖర్ మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతలు చేపట్టిన దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి సమర్ధవంతంగా పార్టీని జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో నడపగలరనే విశ్వాసం ఉందన్నారు. మనమంతా జగనన్న సైనికులం - ప్రజలకు సేవకులం అని కొనియాడారు. ప్రకాశం జిల్లా రెండో పులివెందుల అని, రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికల్లో నిరూపించి 8 నియోజకవర్గాల్లో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో గెలిపించి మన జగనన్నకు గిఫ్టుగా అందిద్దామన్నారు. కడప జిల్లాలో రెండు వైసిపి ఎమ్మెల్యే సీట్లు గెలిస్తే మన ప్రకాశం జిల్లాలో రెండు ఎమ్మెల్యే సీట్లు గెలిచాయి జన అభిమానం కలిగిన గడ్డ మన ఒంగోలు గడ్డ అన్నారు. ఇక పై జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్తేజంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాసమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై ఎప్పటికప్పుడు పోరాటం చేసేందుకు పార్టీ అధిష్టానం, జిల్లా నాయకత్వం పనిచేస్తుందన్నారు. ముందుగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రకాశం జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షుడుగా ఒంగోలులో శుక్రవారం బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి 50 కార్లతో ర్యాలీగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి వెళ్లారు.






# ఏపీ వైఎస్ఆర్‌టీఏను అన్ని జిల్లాల్లో పటిష్టపరుచుకోవాలి

### వైసీపీ విద్యా విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి






(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 4)

ఏపీ వైఎస్ఆర్‌టీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యా విభాగం రాష్ట్ర అధ్యక్షులు,ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏపీ వైఎస్ఆర్‌టీఏను అన్ని జిల్లాల్లో కమిటీలు వేసుకొని.. రాబోయే మూడు నెలల్లో పటిష్టపరుచుకోవాలని తెలిపారు. స్థానికంగా ఉన్న టీచర్ల సమస్యలను, అలాగే రాష్ట్ర స్థాయిలో తీసుకునే నిర్ణయాలలో ఉపాధ్యాయులకు, విద్యారంగానికి జరుగుతున్న అన్యాయాలను గుర్తించి.. ఉపాధ్యాయులకు అండగా నిలబడే విధంగా నాయకత్వాన్ని పటిష్టపరచాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉండి వెనువెంటనే స్పందించి ఎంఈవో, డీఈవోలతో మాట్లాడి వారికి తగిన న్యాయం జరిగేలా చూడాలని.. అవసరమైతే దీనికి రాష్ట్ర కార్యవర్గం కూడా సహకారం అందించాలని తెలియజేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఉపాధ్యాయుల మరియు విద్యారంగం కు సంబందించిన సమస్యలను తన దృష్టికి తీసుకు రాగలిగితే చట్ట సభలలో కానీ లేదా అవసరం అయిన అన్ని వేదికల మీద ప్రశ్నించడం తో పాటు న్యాయం జరిగే వరకు మీతో కలిసి పోరాడుతానని, ప్రయత్నిస్తానని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మిగిలిన అన్ని సోదర ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఉపాధ్యాయుల సమస్యలపై అవసరమైతే ఉమ్మడి పోరాటానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. నవంబర్ నెల చివరి నాటికి ఉపాధ్యాయుల సభ్యత్వాన్ని కూడ పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని వైఎస్సార్‌టీఏ నేతలు ఘనంగా సన్మానించారు.

## నారా లోకేష్‌ను కలిసిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 4)

సచివాలయంలోని మినిస్టర్స్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాల పై చర్చించారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకారం అందించాలని కోరగా, లోకేష్ సానుకూలంగా స్పందించారు.

## శ్రీగిరి నిలయానికి మేల్ చాట్ వస్త్రాల సమర్పణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 4)

శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి శరన్నవ రాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తుల నుండి అపూర్వ స్పందన లభిస్తుంది. ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఒంగోలుకు చెందిన సింగరాజు గణేష్ సాయి శరత్, లక్ష్మీ సౌమ్య దంపతులు శుక్రవారం శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి మేల్ చాట్ వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మేల్ చాట్ వస్త్రాలను సమర్పించిన సింగరాజు దంపతులకు ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి మేల్ చాట్ వస్త్రాలను సమర్పించిన సింగరాజు దంపతులను శ్రీగిరి దేవస్థానం ధర్మ కర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణా రావు, ధర్మ కర్తలు ఆలూరు వేంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మి కుమారి అభినందించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## చిరువ్యాపారులకు ఉపాధి భద్రత కల్పించాలి

### సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యం రమేష్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 4)

పొదిలి నగర పంచాయితీలో రోడ్డు ప్రక్కన ఆక్రమణల తొలగింపులో ఉపాధి కోల్పోయిన చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయడం ద్వారా ఉపాధి భద్రత కల్పించాలని సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యం.రమేష్ మున్సిపల్ కమీషనరుని కోరారు.గత నాలుగు రోజులుగా పొదిలి నగర పంచాయితీలో సైడుకాలువ,ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రోడ్ మార్జిన్ ఆక్రమణల తొలగింపుకు పూనుకున్నారు.పట్టణంలో ఉన్న ఇబ్బందుల దృష్ట్యా పట్టణ ప్రజలుతో పాటు ఆక్రమణదారులు తొలగింపులకు సహకరం అందించారు.ఈ తొలగింపు వలన తోపుడు బండ్లు,బంకులు పెట్టుకొని కుటుంబాలను పోషించు కుంటున్న చిరు వ్యాపారులు జీవనోపాధి కోల్పోయి బజారున పడ్డవారి ఉపాధికి మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్ మార్జిన్ లో ఆక్రమణలు తొలగించి సైడు కాలువలు ప్రొక్లైన్ తో తీసి వెళ్ళటానికి దారి వసతి కల్పించకపోవడంతో వేల రూపాయలు అద్దెలు చెల్లించి షాపులు నడుపుకొంటున్న వ్యాపారులు మూత వేసుకోవాల్సిన స్థితి నెలకొన్నందన్నారు. అలాంటి వారి ఉపాధికి ఇబ్బంది లేకుండా తక్షణం సైడు కాలువలు నిర్మాణం పూర్తిచేయాలి.మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి.రోడ్ మార్జిన్ ఆక్రమణలతో పాటు పంట కాలువలు, రహదారులు, వాగులు, ప్రభుత్వస్థలాల ఆక్రమణల తొలగింపుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమస్యలు పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోకుంటే ఉపాధి కల్పనకు బాధితులతో కలిసి ఆందోళన చేయాల్సి వస్తుందన్నారు.

## లీడ్ క్యాప్ చైర్మన్ పి మాణిక్యాలరావుకు శుభాకాంక్షలు తెలిపిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 4)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీడ్ క్యాప్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పిల్లి మాణిక్యాల రావుకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియచేశారు. శుక్రవారం ఉదయం తాడేపల్లిలోని లీడ్ క్యాంపు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన మాణిక్యాలరావుకి పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com